


పిల్లలూ... పెద్దలు... ముళ్ళున్నాయి జాగ్రత్త!

చిన్నారి సాయిరాం

(పిల్లల నవలిక)

(నేటి పాఠశాలల విద్యా వ్యవస్థకు అక్షర రూపం ఈ నవలిక)

రచయిత

డా॥ కొప్పరపు నారాయణమూర్తి. Ph.D

(ప్రొఫెసర్ డా॥ సి.ఎస్.హెచ్.ఎన్.మూర్తి Ph.D)

పిల్లలూ... పెద్దలు... ముళ్ళున్నాయి జాగ్రత్త!

(పిల్లల నవలిక)

ముద్రణ : మే 2024

ప్రతులు : 500

ఐ.ఎస్.బి.ఎన్. నెం.: 978-93-340-5655-6

ప్రచురణ కర్త : డా॥ కొప్పరపు నారాయణమూర్తి పిహెచ్.డి.
(డా॥సి.ఎస్.హెచ్.ఎన్.మూర్తి)
సెల్ : 7671909759

ముఖ పత్రం : రాపిక్సల్.కామ్ సౌజన్యంతో

పంపిణి : డా॥ కొప్పరపు నారాయణమూర్తి పిహెచ్.డి.
(డా॥సి.ఎస్.హెచ్.ఎన్.మూర్తి)
సెల్ : 7671909759

వెల : రూ. 80/-

చిత్రాలు గీచినవారు : బొమ్మన్ (బ్రహ్మం)

డి.టి.పి. : శ్రీ దుర్గ గ్రాఫిక్స్, శ్రీ అష్టలక్ష్మి గుడి ఎదురుగా,
కొత్తపేట, తెనాలి - 522 201,

సెల్ : 9110761291

విషయసూచిక

చొక్కాపు వేంకటరమణ
కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత
మాజీ ఉద్యోగి జవహర్ బాల భవన్
హైదరాబాదు.

'విద్యకు సరైన మార్గం' చూపిన నవల
పిల్లలూ... పెద్దలు... ముళ్ళున్నాయి జాగ్రత్త!

'బతక లేక బడి పంతులు కాదు. సరైన బడి పంతుల్లేక బతుకు లేదు' అనుకోవలసిన రోజులివి.

బాల్యం రంగూ, రుచీ, వాసన కోల్పోయిన ఈనాటి పిల్లలు పంజరాల్లో చిక్కిన రెక్కలు తెగిన పక్షులు. ఆన్‌లైన్ అరణ్యంలో వీడియో గేముల వీరులు. కన్నవాళ్ళ కలల్ని మోస్తున్న ర్యాంక్‌ల కార్డులు. నేటి బాల్యం ఘనీభవించిన సముద్రం' – ఇది వర్తమానం !

ప్రాచీన కాలంలో దూరాలనూ, భారాలనూ లెక్క చేయకుండా విద్యాభ్యాసం కోసం గురువులను వెతుక్కుంటూ వెళ్ళేవారు. ఎవరి స్థాయిని బట్టి వాళ్ళకు చెప్పేవాళ్ళు గురువులు. ఆనాటి ఆధ్యాత్మిక విద్య, ఆధ్యాత్మిక గురుశిష్య సంబంధం వేరుగా ఉండేది. ఇది మొన్నటి సంగతి!

చరిత్ర పాఠాలను బోధించటమే కాదు. చరిత్రను సృష్టించిన టీచర్లూ ఉన్నారు. జీవితం లెక్కలు చెప్పే మాస్టార్లూ ఉన్నారు. మాస్టార్లను లెక్క చెయ్యని స్టూడెంట్లూ ఉన్నారు.

కొందరికి తాము ఫలానా వారి దగ్గర చదువుకున్నామని చెప్పడం గౌరవం. మరికొందరికి తమ దగ్గర ఫలానా వారు చదువుకున్నారని చెప్పడం ఆనందదాయకం.

ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా, విశ్వ విద్యాలయాల్లో ఆచార్యుడిగా ఏళ్ళు తరబడి తలమునక వేసిన మిత్రుడు డా॥ కొప్పరపు నారాయణమూర్తి (పూర్వాశ్రమంలో గిరిజా నారాయణ్) రాసిన పిల్లల నవల 'పిల్లలూ.. పెద్దలు... ముళ్ళున్నాయి జాగ్రత్త' చదివాక చలించిపోయి, మనసాగక ఈ ఉపోద్ఘాతం రాశాను. ఈ నవలలో ప్రతి అక్షరం ఆరోగ్యకరమైన 'బడి' కట్టు రాళ్ళు అనిపించాయి. పిల్లలూ... పెద్దలూ చదవలవలసిన ఈ నవలలోని పాత్రల్ని మనం బడుల్లో చూస్తున్నదే. పసి పిల్లల హృదయాలపై రాక్షస ముద్రలు వేసే టీచర్లూ కనిపిస్తారు. పిల్లలకి స్వేచ్ఛనిచ్చి నిశబ్దంగా వారి మనోభావాలను పరిశీలించి వారిని తీర్చి దిద్దే టీచర్లూ కనిపిస్తారు.

ప్రతి విద్యార్థికీ నచ్చిన హెడ్ మాష్టారు శర్మగారి లాంటి ఆదర్శ ఉపాధ్యాయులుంటారు. అలాంటి గురువుల ప్రభావం శిష్యుల మీద ఎంతో కొంత పడుతూనే ఉంటుంది. అలాంటి ఉత్తములు ప్రత్యేకించి ఏ ఉపదేశమూ చేయకపోయినా వాళ్ళు ఏం చెప్పినా, చేసినా అదే ఉపదేశం అవుతుంది.

ఈ నవలలో విద్యా వ్యవస్థ మీద, టీచర్ల మీద శాపనార్థాలు లేవు. విద్యార్థులకు సాయమందించిన మనుషుల పట్ల స్మారక వచనాలు తప్ప.

నైతిక విలువలు లేని సమాజం బలహీనంగా ఉంటుందని గుర్తించిన డా॥ నారాయణమూర్తి కొత్త సృష్టి మీద దృష్టి పెట్టి ఈ నవల రాశారు. స్వామి వివేకానంద వేదాంతాన్ని భగవద్గీతను, ఉపనిషత్తుల్ని అధ్యయనం చేసిన, వివేకానంద ప్రసంగాలలోని 'విద్యకు సరైన మార్గం' బాగా ఒంటబట్టించుకున్న రచయితకు విద్యారంగంపై స్పష్టత వచ్చింది.

డా॥ నారాయణమూర్తి నవలలోని విద్యకు సంబంధించిన విషయం లడ్డులోని జీడిపప్పులాంటిది. ఉండలో ఉండేది ఒక్కటే అయినా ఎక్కడో దాక్కుని ఉంటుంది. కానీ చాలా రుచిగా ఉంటుంది. ఈ నవల చదివి, తెలుసుకున్న టీచరూ, స్టూడెంటూ మధ్యన ఉండే మమకారప్పాస రుచిని నేనెప్పటికీ మరిచిపోలేను. మీరు మరిచిపోరు!

– చొక్కాపు వేంకటరమణ

డా. పత్తిపాక మోహన్
కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత
తెలుగు సంపాదకులు & ఆఫీసర్ ఇంచార్జ్
దక్షిణ ప్రాంత కార్యాలయం, బెంగళూరు
నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా
విద్యా మంత్రిత్వశాఖ భారత ప్రభుత్వం

అభినందన

డా. కొప్పరపు నారాయణమూర్తి గారు తొంభయ్యవ దశకంలోనే పిల్లల కోసం తపించి రాసిన బాల సాహితీవేత్త, జర్నలిస్టు. బాల సాహితీవేత్త చొక్కాపు వేంకటరమణ వంటి వారితో కలిసి పనిచేశారు. తొలి నాళ్ళలో విపుల, చతురలతో పాటు వివిధ పత్రికల్లో వివిధ హెూదాల్లో పనిచేశారు. జర్నలిజం విభాగంలో ఆచార్యులుగా దాదాపు రెండున్నర దశాబ్దాలపాటు ఉద్యోగ రీత్యా అనేక దేశాల్లోనూ, మన దేశంలోని వివిధ రాష్ట్రాలలోను పనిచేశారు. అనేక జాతీయ అంతర్జాతీయ జర్నల్స్‌లో జర్నలిజం, ఇతర విషయాలపై రాసిన ప్రామాణిక రచనలు, పరిశోధనా పత్రాలు వచ్చాయి.

యిటీవల ఉద్యోగ విరమణ తరువాత తెలుగు నేల మీద, తన మాతృభూమి ఆంధ్రా పారిస్ తెనాలిలో మళ్ళీ కాలు మోపిన మూర్తిగారు తాను తొంభయ్యవ దశకంలో వివిధ పత్రికల్లో రాసిన కథలను యిప్పుడు కొత్త కొత్తగా పుస్తక రూపంలో తెస్తున్నారు. అప్పుడే రాసిన నవలికకు మరిన్ని కొత్త సొబగులద్ది బాల సాహిత్యాన్ని మళ్ళీ తన జెండాగా పట్టుకుని నూతనోత్సాహంలో నడుస్తున్నారు. మూర్తిగారి కొత్త నడకకు, ఆలోచనకు అక్షరరూపమే మన చేతిలోని ఈ బాలల నవలిక.

మూర్తి గారిని, వారి బాలల రచనలను తొలినాటి నుండి పరిశీలించిన వాళ్ళకు, చదివిన వాళ్ళకు వారి ప్రతి రచనలో అంత:సూత్రంగా నిలిచిన ఒక అంశం లేదా విషయం కనిపిస్తుంది. అది మరేదో కాదు... బడి... ఉపాధ్యాయులు... పిల్లలు... యింకా బడి చుట్టూతా కేంద్రీకృతమైన వాతావరణం. ఇది వీరి కథల్లోనూ, నవలికలోనూ ప్రత్యక్షర సాక్ష్యంగా చూడొచ్చు.

మూర్తిగారికి బడి పట్ల, బడిలో జరిగే వివిధ కార్యకలాపాలపట్ల, పనిచేసే ఉపాధ్యాయుల పట్ల, వివిధ అంశాల పట్ల కొన్ని నిర్దిష్టమైన ఆలోచనలున్నాయి. అంతేకాక క్షీణించుకపోతున్న విలువల పట్ల బడి పేరుతో జరుగుతున్న విద్యా వ్యాపారం మొదలుకుని అనేక విషయాల పట్ల ఆయనకు ఆవేదన ఉంది. అవన్నీ వారు రాసిన 'పిల్లలూ... పెద్దలూ, ముళ్ళున్నాయి జాగ్రత్త' అనే ఈ బాలల నవలికలో కనిపిస్తాయి.

'చిన్నారి సాయిరాం' కేంద్రంగా ఆయనే స్వయంగా తన మాటలో చెప్పినట్టు తన స్వీయ జీవితంలోని ఘట్టాలను చెప్పే ప్రయత్నం చేశారేమో, అడుగడుగునా.. యిందులోని అక్షరమక్షరంలో ఎంతో బాధ, ఆవేదన మనకు కనిపిస్తాయి. ముఖ్యంగా నైతిక విలువలు, గురుశిష్య సంబంధం, అనుబంధాలు, వంటివాటి పట్ల రచయితకున్న అనేక అభిప్రాయాలు ఇందులో చూడొచ్చు.

'ఆధ్యాత్మిక విలువలులేని చోట నైతిక విలువలు కేవలం నీటిపై రాత ల్లాంటివి' అన్నది ఈ రచనలో నర్మగర్భంగా కనిపించే అంశం. రండి, మూర్తిగారి ఆలోచనలు, అక్షరాలతో భాగస్వామ్యమవుదాం! పెద్దలు డా. నారాయణమూర్తి గారు బాలల కోసం రాసిన ఈ నవలకు స్వాగతం పలుకుతున్నాను. జయహో! బాల సాహిత్యం!

– పత్తిపాక మోహన్

నా మాట

ఈ పుస్తకంలోని నవలిక, కథల్లో వివరించిన అనేక సంఘటనలు స్వీయజీవితం నుంచి ప్రభవించినవే. చిన్నప్పుడు విద్యార్థి దశలో పాఠశాలల్లో జరిగే అనేక సంఘటనలు, దృశ్యాలు నా మనఃఫలకంపై చెదరని ముద్రవేశాయి. అయినా చదివిన పాఠశాలలు దేవాలయాలతో సమానం, అందులో చదువు గరిపిన ఉపాధ్యాయులు తల్లిదండ్రులకన్నా మిన్న అనే అభిప్రాయాలతో ఏనాడు వాటిని ఎక్కడా ప్రస్తావించలేదు. నా మనస్సులోనే పదిలంగా దాచుకున్నాను.

ఈమాట ఎందుకు రాస్తున్నానంటే నే చదువుకొనే రోజుల్లో కూడ విద్యాలయాలు కాని, ఉపాధ్యాయులు కానీ అంత ఆదర్శంగా లేరు. కాకపోతే అప్పటికంటే ఇప్పుడు విద్యాలయాలు, ఉపాధ్యాయులు, పిల్లలు, తల్లిదండ్రులు మరీ దిగజారారు. ఈ దిగజారుడుతనం ఏ స్థాయికి వెళ్ళిందో ఇక్కడ వివరించటంకంటే దీన్ని ఎలా ఆపాలో ఆలోచించటం సబబు. అయితే "ఆకాశంబుననుండి, శంభుని శిరంబున నుండి..." అన్న ఒక్క భర్తృహరి సుభాషితం గుర్తుచేసుకుంటే ఇక వివరణ అవసరంలేదనుకొంటా.

"ఇలా రాయడానికి నాకున్న అర్హతలేమిటి?" అని ఎవరైనా ప్రశ్నించవచ్చు. ముందు నేను ఉపాధ్యాయ వృత్తికి అవసరమైన అర్హతలు – బి.ఇడి. తర్వాత ఎమ్.ఇడి. ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడనయ్యాను. తర్వాత విద్యావిధానంపైనే డాక్టరేట్ చేశాను. ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యా యుడిగా ఆ తర్వాత విశ్వ విద్యాలయాల్లో ఆచార్యుడిగా అంచెలంచెలుగా ఎదిగి చివరికి ఆచార్యుడిగా పదవీ విరమణ చేశాను. మామూలుగానైతే

ఈ అర్హతలు చాలు విద్యారంగంపై 'నాడు–నేడు' అనే విశ్లేషణ చేయడానికి. కాని, నా గతానుభవాన్ని విశ్లేషించి చూస్తే విద్యారంగానికి సంబంధించి ఆనాడైనా, ఈనాడైనా మూల సమస్యలు ఒకేరకంగా ఉన్నాయి. ఈ సమస్యల జోలికి పోకుండా విద్యారంగంలో సంస్కరణల గురించి మంత్రులు, రాజకీయ నాయకులు, యాజమాన్యాలు, తల్లిదండ్రులు తరచూ ప్రసంగాలు, ప్రయోగాలు చేయటం చాల విచారాన్ని కల్గిస్తుంటాయి. అసలు నేటి విద్యారంగాన్ని పట్టి పీడిస్తున్న మూల సమస్య "నైతికలోపం". నైతిక విలువల లోపానికి కారణం 'ఆధ్యాత్మిక' విలువల గురించి తెలియకపోవటమేనని నా అభిప్రాయం.

నైతిక విలువలు లేని సమాజం బలహీనంగా ఉంటుంది. బలంలేని వ్యక్తిపై అనేక రోగాలు దాడి చేస్తున్నట్లు, బలహీనమైన సమాజంపై కూడ అనేక పెడధోరణులు దాడి చేస్తుంటాయి. ముఖ్యంగా ఒకప్పుడు విద్యారంగం ప్రభుత్వ ఆధీనంలో ఉన్నప్పుడు దాన్ని మెరుగుపరిచే బాధ్యత కేవలం ప్రభుత్వానిదేనని అందరూ భావించి విమర్శించేవారు. ఎప్పుడైతే విద్యారంగం ప్రభుత్వ ఆధీనంలోనుంచి ప్రైవేటురంగంలోకి వెళ్ళిపోయిందో, ప్రభుత్వ పాత్ర కేవలం ''నామకః'' అన్నట్లు పరిణమించింది. ఇక "ఇప్పుడెవరు బాధ్యులు?" అన్న ప్రసక్తే తలెత్తదు.

విద్యాలయం నడిపేందుకు ఒక సొసైటీ, అందులో కొంతమంది సభ్యులుంటే చాలు. స్కూలు, కాలేజి, మరియు యూనివర్సిటీ కూడ స్థాపించవచ్చు. డబ్బులుంటే ఎవర్నైనా కొనవచ్చు – ప్రభుత్వ గుర్తింపుతో ఏమైనా చేయవచ్చు. విద్యాలయం నడిపేవాడు విద్యావేత్తట. వాడు సిగరెట్లు తాగినా, మాదక ద్రవ్యాలు వినియోగించినా, తాగినా, తప్పినా వాడు విద్యావేత్తేనట. ఎందుకంటే వాడో పెద్ద స్కూలు నడుపుతున్నాడు. డబ్బులొస్తాయి, పేరొస్తుంది కాబట్టి. ఇప్పుడా స్కూల్లో వ్యభిచారం జరిగినా,

మాదక ద్రవ్యాలు అమ్మినా ఆ స్కూలు పేరు బయటికి రాదు, యాజమాన్యాల పేర్లు బయటికి రావు. ప్రభుత్వం రానీయదు. ఇలాంటి విద్యాలయాల్లో చదువుకొంటున్న విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఏమి నైతిక విలువలుంటాయి? అక్కడ చదివించే తల్లిదండ్రులు ఎంత నైతికంగా ఉంటారు? భూస్థాయిలో వాస్తవాలు ఇలా ఉంటే విద్యారంగంలో ఏవో మార్పులు, పాఠ్యాంశాలలో మరేవో చేర్పులు చేస్తే విద్యారంగం ఎంతో బాగుపడిపోతుందను కోవటం ఒక భ్రమకాకపోతే మరేమిటి?

ఉపాధ్యాయ వృత్తికి అర్హత సాధించే ప్రక్రియలో భాగంగా నేను స్వామి వివేకానంద వేదాంతం గురించి చదవవలసి వచ్చింది. అంతకుమునుపే భగవద్గీత, ఉపనిషత్తులు, వేదాధ్యయనం చేసి ఉన్నా వివేకానందుడి ప్రసంగాలలోని 'విద్యకు సరైన మార్గం' నాకు చాలా నచ్చింది. ఎన్నో రహస్యాలు బోధపడ్డాయి. విద్యారంగంపై స్పష్టత వచ్చింది. ఆధ్యాత్మికత కేవలం మోక్షకాములకు, మోక్షసాధకులకు పరిమితమైనదే అన్న భావన నుంచి "ఆధ్యాత్మికత" జీవనవిధానంలోనే ఒక భాగం అన్న విషయం స్వామి వివేకానంద ప్రసంగాలలో బోధపడింది. వివేకానంద వేదాంతంతోపాటు, ఇతర తాత్త్వికులు విద్యారంగం ఎలా ఉండాలి, విద్యాబోధన ఎలా జరగాలో చెప్పిన విషయాలు కూడ చదివాను. కాని వాటన్నింటిలోకన్నా స్వామి వివేకానంద 'విద్య' అంటే ఏమిటి? – వివరించిన తీరు నన్ను బాగా ఆకట్టుకుంది. ఆ తాత్త్వికతను జోడించి విద్యాలయాల్లో నాకెదురైన సమస్యలను ఎలా కథలుగా మార్చాలో ఆలోచించి ఈ చిరు ప్రయత్నం చేశాను.

ఈ కథల్లో చాలాచోట్ల స్వామి వివేకానంద ప్రసంగాలలోని కొన్ని సంగతులను కూడ కథలుగా మార్చాను. శ్రీ రామకృష్ణపరమహంస, షిర్డి సాయిబాబా, భగవాన్ రమణమహర్షి జీవితఘట్టాలలోని

ముఖ్యాంశాలను జోడించి ఒక ఆదర్శ విద్యార్థి, ఒక ఆదర్శ ఉపాధ్యాయుడు ఎలా ఉంటారో ఊహించి రాసిన నవలిక "చిన్నారి సాయిరాం". నా చిన్ననాటి మిత్రుల్లో కొందరిలోని అద్భుతమైన గుణాలను ఈ ఆదర్శ విద్యార్థి సాయిరాంలో ప్రతిబింబించాను. అలాగే మౌనంగా ఉండటం, మోనం పాటించటం వలన ప్రయోజనం వ్యక్తికి, సమాజానికి ఎంత శ్రేయోదాయకమో తెలిపే వివరణలను రమణమహర్షి జీవనశైలి నుంచి తీసుకున్నాను. ఈ కథల్లో కనిపించే పాత్రలకు దగ్గరగా ఉన్న వారిలో చాలామంది నా మిత్రులు, నాకు పరిచయమున్న ఉపాధ్యాయులు ఉన్నారు. కొంతమంది ఇప్పటికీ ఉన్నారు. నేను చదువుకొన్న పాఠశాల ఇప్పటికీ ఉంది. అందుకే వాటిని ఎవ్వరూ గుర్తుపట్టకుండా తగిన రీతిలో మార్చాను.

నేను ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన పాఠశాలలు, కాలేజీలు అనేకం ఇప్పుడు మూతబడ్డాయి. కేవలం యాజమాన్యాలలో నైతికవర్తన లేకపోవటం, దుబారా, వారిమధ్య రాజకీయాలు, అధికార దుర్వినియోగం వంటి కారణాలతో. కొన్ని ఇప్పటికీ ఉన్నా అవి ఇవే జాడ్యాలతో రోగాల బారినపడి పీక్కుంటున్న వృద్ధరోగుల్లా చావూ, బ్రతుకూ మధ్య కొట్టుమిట్టాడుతున్నాయి.

ఏది ఏమైనా ఈ కథలు ఆశాంతం చదివితే నిజ జీవితంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆధ్యాత్మిక విలువలను ఆచరించవచ్చు అనే నమ్మకం, విశ్వాసం కలుగుతాయి. ఆచరించటం వలన ప్రయోజనాలేకాని, నష్టాలు సంభవించవు. ఈవిధంగా ఇంకా ఎన్నో కథలు, నవలికలు రాయవచ్చు. ప్రస్తుతం మొబైల్ ఫోన్లు, స్మార్ట్ ఫోన్లు, మాదకద్రవ్యాలు, పోర్న్‌సైట్లు వంటి అధునాత టెక్నాలజీ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, యాజమాన్యాలకు, తల్లిదండ్రులకు

అందుబాటులోకి రావటం వలన నైతిక విలువలు విద్యార్థుల్లో పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడింది. వీటినుంచి గట్టెక్కడానికి ఈ ఆధ్యాత్మిక విలువలను నిత్య జీవితంలో ఎలా అమలుచేయాలో మరోచోట చెప్పే ప్రయత్నం చేస్తాను. ఆధ్యాత్మిక విలువలు లేనిచోట నైతిక విలువలు కేవలం నీటిపై రాతల్లాంటివే అన్నది స్థూలంగా ఈ పుస్తక అభిప్రాయం.

ప్రస్తుతానికి ఈ చిరు ప్రయత్నాన్ని పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలో మంచి మార్పు రావాలని కోరుకునే వారందరూ ఆహ్వానిస్తారని, ఆదరిస్తారని విశ్వసిస్తూ శలవు తీసుకుంటున్నాను.

– డా॥ కొప్పరపు నారాయణమూర్తి, పిహెచ్.డి.

– (డా॥ సి.ఎస్.హెచ్.ఎన్.మూర్తి)

చిన్నారి సాయిరాం

అది ఒంగోలు.

అటు పట్టణమూ కాదు, ఇటు పల్లెటూరు కాదు. మధ్యస్తంగా ఇప్పుడిప్పుడే ప్రగతిమార్గంలో పయనిస్తున్న ఒక మధ్యరకం టౌను. సగం ఎదిగిన రావిచెట్టు, మర్రిచెట్టు, వేపచెట్టు ఒకేచోట పెరుగుతున్నట్లు, ఆ ఊర్లో మేధావులు, ఉద్యోగస్తులు, కూలీనాలీ జనం అంతా కలగలుపుగా జీవిస్తుంటారు.

ఊరికి పడమరవైపు రంగారాయుడు చెరువు, గాంధీపార్కు, బస్‌స్టాండు, తూర్పువైపు రైల్వే స్టేషను ఈ ఊరు ఎల్లలు. మొత్తం ఎటుతిప్పినా నాల్గు, ఐదు మైళ్ళకంటే వెడల్పు ఉండని ఈ ఊళ్ళో రెండే రెండు మున్సిపల్ స్కూళ్ళు, ఒక పెద్ద డిగ్రీ కాలేజి. చిన్నాపొన్నా ఎలిమెంటరీ స్కూళ్ళు ఒక అరడజను దాకా ఉంటాయి.

ఏ ఊళ్ళో ఉండే కాకుల సంఖ్యయైనా ఖచ్చితంగా చెప్పటం ఎప్పటికీ సాధ్యంకాదని బీర్బల్ అక్బర్‌గారికి చెప్పినట్లు – ఈ ఊరి జనాభా సంఖ్యకాని, మఘలోపుట్టి పుబ్బలో పోయే ప్రైవేటు స్కూళ్ళు, కాలేజీల సంఖ్యగానీ నరమానవుడు సరిగ్గా లెక్కగట్టి చెప్పలేడు అంటారు ఈ ఊరి శంకరమఠం సోమయాజులుగారు.

ఈ ఊరి మున్సిపల్ స్కూలుకు చాలా పేరుంది. రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి అయిన ప్రకాశంగారి నుంచి, అంతర్జాతీయ సమితిలో భారతదేశం తరపున సభ్యుడైన తొలి తెలుగువాడు కొండపి చెంచుదాకా ప్రముఖ విద్యావేత్తలు ఈ స్కూలు వారే. ఇప్పుడు ఆ స్కూలుకు పోటీగా ఏర్పడిన మరో స్కూలుకు సాయిరాం వాళ్ళమ్మతో రాబోతున్నాడు.



తూర్పు దిక్కున సూర్యోదయం, కొండమీద రామాలయం గంటలు. గాంధీ పార్కులో పక్షుల కిలకిలలు, రంగారాయుడి చెరువు నీళ్ళ అలల శబ్దాలు – చిన్నారి సాయిరాం హృదయాన్ని నిత్యం పులకింపజేసే అద్భుత దృశ్యాలు.

ఉదయం అయిదింటికే నిద్రలేచే సాయిరాం, భగవంతుడి ప్రార్థన ముగించుకొని, సూర్యోదయం వేళకి స్నానపానాదులు కానిచ్చి, ప్రకృతి రమణీయత తిలకించడానికి మేడపైకి చేరతాడు. ఆ ఇంటి పైనుంచి చూస్తే అల్లంతదూరాన పచ్చటి కనిగిరి కొండలు కనిపిస్తుంటాయి. దూరాన పొగాకు బ్యార్నీలనుంచి, ఇటుకబట్టీల నుంచి రింగులు రింగులు తిరుగుతూ వచ్చే పొగ – అదో కలగలుపు అనుభూతి.

సాయిరాం వయస్సు పన్నెండు సంవత్సరాలు. తల్లి భవానీదేవి కూడ ఉపాధ్యాయురాలే. సాయిరాం తండ్రి చిన్నప్పుడే పోవటంతో తల్లి భవానీదేవి ఉద్యోగం చేయవలసి వచ్చింది. సాయిరాం తల్లికూడా ప్రభుత్వ ఎలిమెంటరీ స్కూల్లో సెంకడరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తూ ఉద్యోగంపై ఒంగోలు ట్రాన్స్‌ఫరయి వచ్చింది. అంతకుముందు దర్శి అప్పర్ ప్రైమరీ స్కూల్లో తల్లితోపాటే సాయిరాం కూడ స్కూలుకు వెళ్తూ ఆరవ తరగతి వరకూ చదివాడు.

ఒంగోలులో మాత్రం తల్లి స్కూలు చాలాదూరం అవటంచేత, దగ్గర్లోని స్కూల్లో చేరుద్దామన్న భవానీదేవి నిర్ణయాన్ని సంతోషంగా అంగీకరించాడు సాయిరాం.

తల్లి వేలు పట్టుకొని సాయిరాం ఆ స్కూల్ గేట్లోకి అడుగుపెట్టాడు.

ఎదురుగా స్కూల్ మెట్లపైన నిల్చున్న గంభీరమైన ఆకారాన్ని చూసి ఒక్క క్షణం తల్లి చేతులు విడిచి ఆగిపోయాడు సాయిరాం.

"ఏంటి బాబు, ఆగిపోయావు? ఓ ఆయన్ని చూసా! ఆయన ఈ స్కూలు హెడ్మాస్టారు. పేరు శర్మగారు" చెప్పింది భవానీదేవి.

ఒక్కసారి హెడ్మాస్టారు వంక ఎంతో గౌరవంతో, అభిమానంతో చూసి దూరం నుంచే నమస్కరించాడు సాయిరాం.

"అబ్బ ఎంత బాగున్నారో హెడ్మాస్టారుగారు చూడటానికి. పసుపు పచ్చని గుండ్రని ముఖాన ఎర్రని తిలకం, తెల్లని గోచిపోసిన ధోవతిపై తెల్లటి లాల్చీ, పైన ఆకుపచ్చని జరీ అంచు కండువా, దాదాపు ఆరు అడుగుల ఎత్తు – అమ్మ తరచూ చేసే అనంత పద్మనాభస్వామి వర్ణనలా ఉన్నారు" అని అనుకొన్నాడు మనస్సులో.

తల్లి, కొడుకులు ఇద్దరూ దగ్గరికి రావటంతో, శర్మగారు బాబువైపు చూస్తూ "ఏరా అబ్బాయి! చేర్తావా మా స్కూల్లో. బాగా చదవాలిసుమీ! మీ నాన్నగారి పేరు నిలబెట్టాలి తెల్సిందా!" అంటూ దగ్గరికి వెళ్ళి సాయిరాం భుజం తట్టాడు.

తలూపాడు సాయిరాం. ప్యూన్ వెంకట్రావును పిలిచి – "రేయ్, సాయిరాంను తీసుకెళ్ళి సెవెన్త్ క్లాస్ 'ఏ' సెక్షన్‌లో కూర్చోపెట్టిరా. ఆ చూడు, అక్కడ ఇప్పుడు ఇంగ్లీషు క్లాసు జరుగుతుంటుంది. బహుశ సుబ్బారావుగారనుకొంటాను. ఆయనకి చెప్పు. కొత్తగా ట్రాన్స్‌ఫర్ మీద వచ్చి చేరాడని, తెలిసిందా" గర్జిస్తున్నట్లు చెప్పారు శర్మగారు.

శర్మగారు చెప్తున్నంతసేపు ఆయనవైపే దీక్షగా చూశాడు సాయిరాం. శర్మగారి కంఠం ఖంగున మోగటం సాయిరాంకు ఎంతో సంతోషంగా ఉంది. బొంగురు కంఠాలన్నా, ఆడవాళ్ళ కంఠాలున్న మగవాళ్ళన్న సాయిరాంకు బొత్తిగా ఇష్టం ఉండదు. కంచులా ఖంగున మోగే కంఠం నిజమైన సింహం కంఠంలాంటిదని సాయిరాంకు చిన్నప్పుడు వాళ్ళ బామ్మ చెప్పిన మాటలు మనస్సులో బాగా నాటుకు పోయాయి.

సాయిరాం వెంకట్రావుతో క్లాసురూం వైపు అడుగులు వేశాడు. సాయిరాం సందు మలుపు తిరిగేదాకా తల్లి భవానీదేవి చేస్తూ నిల్చుండిపోయింది. మలుపు తిరగబోయే ముందు సాయిరాం వెనక్కితిరిగి తల్లివైపు ప్రేమగా చూసి, చెయ్యి ఊపి ముందుకు వెళ్ళాడు.

1

క్లాసులో పాఠం జరుగుతోంది. ఇంగ్లీషు మాస్టారు సుబ్బారావుగారు స్వామి వివేకానందపై పాఠం చదివి, తెలుగులోకి అనువాదంచేసి చెప్తున్నారు.

స్వామి వివేకానంద జీవిత విశేషాలు, ఆయన అమెరికా, బ్రిటన్‌లలో చేసిన ప్రసంగాలలోని కొన్ని ముఖ్య అంశాలు కలిపి ఆ పాఠాన్ని రూపొందించారు.

సుబ్బారావు మాస్టారు చెప్పేదాన్ని శ్రద్ధగా వింటున్నాడు సాయిరాం.

"వివేకానందుడు విదేశాల్లో ముఖ్యంగా చాటి చెప్పింది భారతీయత ఆధ్యాత్మికత ఔన్నత్యం. మన ఋషులు, మునులు దర్శించిన సత్యాలను విదేశీయులకు బోధించటంలోనూ, భగవద్గీతను ఆంగ్ల భాషలో విశదీకరించటంలోనూ వివేకానందుని ప్రతిభకు ఆశ్చర్యపోయారు అమెరికా, బ్రిటన్ ప్రజలు. ఆయన్ని "దేవవక్త" అని, "హిందూ సింహం" అని కూడ వాళ్ళు అభినందించారు. ఆయన భారతీయ సంస్కృతికి చేసిన అపారమైన సేవకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయన పుట్టినదినం జనవరి 12ను ప్రతి సంవత్సరం "జాతీయ యువత" దినంగా ప్రకటించింది. ఆయన చెప్పిన విషయాలు ఎక్కువ శాతం ఆధ్యాత్మికతకు సంబంధించినవి. అందువలన మీరు నేనిప్పుడు చెప్పినవి గుర్తుంచుకుంటే చాలు. పరీక్షలో ఈ పాఠం నుంచి ఒకటి, అరా ప్రశ్నలకంటే ఎక్కువ రావు. ఏంటి, విన్నారా?" దబాయించి మరీ అడిగారు సుబ్బారావు మాస్టారు పిల్లల్ని.

అయితే, సుబ్బారావు మాస్టారుగారు పిల్లల్ని ఇలా దబాయిస్తున్నప్పుడు పక్క క్లాసులో హెడ్మాస్టరుగారు టీచింగ్ ఇన్స్పెక్షనుకు వచ్చినట్టు, ఆయన ఒక చెవు ఇటు వేసి సుబ్బారావు మాస్టారుగారు పిల్లలకి చెప్తున్నది వింటున్నట్టు సుబ్బారావుగారికి తెలియదు. అదే హెడ్మాస్టారు శర్మగారి ప్రతిభ రహస్యం. సుబ్బారావు మాస్టారుగారి గద్దింపు విని పిల్లలు భయపడి, 'అలాగేనండి' అన్నట్టు తలూపారు.

ఇంతలో వెనుకనుంచి ఒక కుర్రవాడు లేచి "సార్! ఈ పాఠంలో 'ఇంప్' క్వెచ్చెన్‌లు రెండివ్వండి, చాలా క్వెచ్చెన్‌లు ఉన్నాయి" అని అడిగాడు.

"కూర్చో! కూర్చో! జిడ్డు ముఖమా... "ఇంప్ క్వెచ్చెన్‌లా? ఇంప్ క్వెచ్చెన్‌లేమిట్రా నీ మొహం! 'ఇంప్' అంటే దయ్యం' అని అర్థం తెల్సా? "ఇంప్ కాదురా, 'ఇంపార్టెంట్ క్వశ్చన్స్' – అనాలి, తెలిసిందా? ముఖం చూడు! ముఖం! చీకేసిన మామిడి టెంకె ముఖం నువ్వూనూ" అన్నారు సుబ్బారావు మాస్టారు.

పిల్లలంతా ఒక్కసారి వాడి ముఖంవైపు చూసి నవ్వారు. ఇంతలో మరొకడు లేచి, "సార్! మమ్మల్ని ఏ గైడ్ చదివి ఆన్సర్ రాయమంటారు? స్వస్తిక్ గైడ్ కొన్నాను సార్! అందులో ఆన్సర్స్ చాలా పెద్దగా ఉన్నాయి. ఈ వివేకానందం పాఠంలోనే ఒక్కొక్క క్వశ్చెన్‌కు పదిలైన్లు ఆన్సర్ రాశారు సార్. ఛస్తాం. సార్! అంత పెద్ద పాఠం ఒప్పచెప్పాలంటే" అన్నాడు.

"రేయ్! రమేష్" పిల్చాడు సుబ్బారావు మాస్టారు.

"ఎస్ సార్!" అంటూ లేచాడు రమేష్ ఒక మూల నుంచి.

"అంతదూరంలో ఎందుకు చచ్చావురా కర్రి ముండా కొడుకా! దగ్గరికి చావు! నీకు నిన్ననంగా చెప్పానా? ఏంచేశావు?" అడిగాడు సుబ్బారావు మాస్టారు గర్జిస్తూ.

"ఏంటిసార్?" పాలిపోయిన ముఖంతో గుండు గోక్కుంటూ అడిగాడు.

"పో" అర్జంటుగా పోయి వెంకట్రామా అండ్ కో లో మా సుబ్బారావు సార్ రాసిన సెవెన్త్ క్లాస్ ఇంగ్లీషు గైడ్లని అర్జంటుగా ఒక పాతిక తెమ్మన్నారని చెప్పి పట్టుకురా! క్లాసు అయిపోయేలోపుగా తేకపోయావో

చచ్చావన్నమాటే" కొట్టినట్లు అరిచారు సుబ్బారావు మాస్టారుగారు.

ఇందాక ప్రశ్న అడిగిన కుర్రవాడు అలానే నిల్చున్నాడు మాస్టారి సమాధానం కోసం.

"అలానే నిల్చున్నావేరా దిబ్బ ముఖం వాడా! కూర్చో! గైడ్స్ తెప్పిస్తాను. నేను రాసిన గైడ్‌లే. అన్ని పుస్తకాలు షాపుకు నిన్ననే వచ్చి ఉంటాయి. మీరు స్వస్తిక్ గెడ్లు, పండిట్స్ గైడ్లు కొనబోకండి! అయినా–అసలు ఎవరు కొనమని చెప్పారు మిమ్మల్ని ఆ గైడ్లు! చంపేస్తాను లమ్డీ కొడుకుల్లారా! స్వస్తిక్ గైడ్లుట! గైడ్లు! నేను రాసింది తెప్పిస్తాను! అందరూ తలా ఒకటి కొనుక్కు చావండి! అందులోంచే క్వశ్చెన్స్ వస్తాయి! ఆన్సర్స్ రాయాలి తెలిసిందా?" గట్టిగా కేకలేశారు సుబ్బారావుగారు.

పాపం సాయిరాంకు ఇదంతా చూస్తుంటే పొట్ట తిప్పినట్లయింది. మాస్టారయి ఉండి సుబ్బారావుగారు పిల్లల్ని బండబూతులు తిట్టడం, సాయిరాంకు జీర్ణం కావటం లేదు. అతని కళ్ళవెంబడి నీళ్ళు సుడులు తిరిగాయి.

ఇంతలో హెడ్మాస్టారు శర్మగారు క్లాసులోకి వచ్చారు. ఆయన్ని చూడగానే పిల్లలంతా ఒక్కసారి లేచి నిల్చున్నారు.

సుబ్బారావు మాస్టారుగారు కూడ అప్రమత్తం అయినారు.

"ఏం మాస్టారు? పాఠం చెప్పటం అయిందా? ఏమిటీ మీ పంచాంగ పఠనం ఇంకా హద్దు, ఆపు లేకుండా నిరాఘాటంగా సాగిపోతోంది? విషయం ఏమిటి?" అడిగారు హెడ్మాస్టారు శర్మగారు.

"అబ్బే... పెద్ద విషయం ఏమీ కాదండీ... అయినా మీకెందుకులెండి ఆ శ్రమంతా. ఇవన్నీ నిత్యం స్కూల్లో మామూలే. రండి, కూర్చోండి!" అంటూ టేబిల్ జరిపి హెడ్మాస్టారుగారిని ఆసీనులు కమ్మన్నట్లు

ఆహ్వానించారు సుబ్బారావుగారు.

"భలేవారే! మర్యాదకేమీ లోపం రానీయరు. సరే! విషయానికి వద్దాం. ఈ రోజు ఏం పాఠం చెప్పారు?"

"ఏం పాఠమో సార్! పిల్లల స్థాయినిబట్టికదా పాఠం ఉండవలసింది. స్వామి వివేకానంద ఉపన్యాసాలు పిల్లలకేమి అర్థమవుతాయి చెప్పండి. అయినా చెప్పాననుకోండి" అన్నారు సుబ్బారావు మాస్టారు.

పిల్లలంతా సుబ్బారావు మాస్టారు వైపు, హెడ్మాస్టారు వైపు మార్చి మార్చి చూస్తున్నారు.

"ఏదీ... ఆ ఇంగ్లీషు బుక్ ఇలా ఇయ్యండి" అని సుబ్బారావు మాస్టారుగారి చేతిలోని ఇంగ్లీషు బుక్ అందుకున్నారు హెడ్మాస్టారు శర్మగారు.

కాసేపు ఆ పాఠాన్ని చదివి, పిల్లలవైపు చూస్తూ "రేయ్... మీలో ఈ పాఠం అర్థమయినవాళ్ళు ఎవరో చేతులెత్తండిరా" అడిగారు హెడ్మాస్టారు శర్మగారు.

ఒక్క సాయిరాం తప్ప ఎవ్వరూ చెయ్యి ఎత్తలేదు.

చెయ్యి దించమని సాయిరాంకు సైగచేసి, సుబ్బారావు మాస్టారుగారివైపు తిరిగి "ఏమిటి మాస్టారు ఇది, ఇంతమంది ఉన్న క్లాసులో ఒక సాయిరాం, అది కూడ నిన్న కాక మొన్న వచ్చిన సాయిరాం తప్ప మరెవ్వరూ మీరు చెప్పిన పాఠం అర్థం కాలేదంటున్నారంటే ఏమిటి కారణం?" అడిగారు హెడ్మాస్టారు.

"చెప్పా కదండి... పాఠం వాళ్ళ స్థాయికి మించినదని..." గొణిగారు సుబ్బారావు గారు.

"నో... నో... నేను ఒప్పుకోను... ఆ పాఠాన్ని ఇప్పుడు నేను చదివాను. స్వామి వివేకానంద గొప్పతనం గురించి మీకు తెలియదు. ఆయన ఇంగ్లీషు ఒక అద్భుతం. చిన్నపిల్లల నుంచి, మహా మేధావుల దాకా అందరికీ తీయగా మధురంగా సున్నితమైన భావాలను చెప్పగల్గిన ఆయన ఇంగ్లీషుపట్ల, భావాలపట్ల మీరు పిల్లలకు లేనిపోని అపోహలు కలిగిస్తున్నారు. ఇది చాలా ప్రమాదకర ధోరణి. ఊఁ! పాఠం తీసి మీరు వివరించండి... నేను వినాలి... ముందు మీరు ఎలా చెప్తున్నారో నాకు తెలిస్తే గదా, పిల్లలకు ఎందుకు అర్థం కాలేదో బోధపడేది. త్వరలోనే డీ.ఈ.ఓ. ఇన్స్పెక్షన్ కూడ ఉంది. పైగా భవిష్యత్తులో ప్రభుత్వ సూళ్ళలో నూరు శాతం ఫలితాలు రాకపోతే టీచర్లకు ప్రొమోషన్‌లు, ఇంక్రిమెంట్లు ఆపు జేస్తారని ప్రభుత్వం ఇటీవలే ప్రకటించింది'' అన్నారు హెడ్మాస్టారుగారు.

సుబ్బారావుగారు పాఠం చెప్పటం ప్రారంభించారు.

Education is the manifestation of perfection which is already in man.

What is education? Is it book-learning? No. Is it diverse knowledge? Not even that. The training by which the current and expression of will are brought under control and become fruitful is called education.

To me the very essence of education is concerntration of mind, not the collecting of facts. If I had to do my education over again, and had any voice in the matter, I would not study



facts at all. I would develop the power of concentration and detachment, and then with a perfect instrument, I could collect facts at will.

The education which does not help the common mass of people to equip themselves for the struggle of life, which does not bring out strength of character, a spirit of philanthropy, and courage of lion - is it worth the name? Real education is that which enables one to stand on his own legs.

Knowledge is inherent in man: no knowledge comes from outside; it is all inside... we say Newton discovered gravitation. Was it sitting anywhere in a corner waiting for him? It was in his own mind; the time came and he found it out. All knowledge

that the world has ever received comes from the mind. The infinitive library of the unverse is in your own mind. The external world is simply suggestion, the occassion which sets you to study your own mind.

What we want is Sraddha. Unfortunately, it has nearly vanished from India, and that is why we are in our present state. What makes the difference between a man and another man is the difference in this Sraddha.

"ఆ... ఇక ఆపి పిల్లలకు ఎలా వివరిస్తారో వివరించండి" అన్నారు హెడ్మాస్టారు శర్మగారు.

"చదువు అనేది మనిషి బాహ్య ప్రపంచం నుంచి నేర్చుకొనేది కాదు. సమస్త చదువు మనలోనే ఉంది. అయితే ఆ విషయం గ్రహించినప్పుడే మనకు సమస్త చదువు అవగతమవుతుంది.

చదువంటే బయటినుంచి పుస్తకాల ద్వారా చదివే చదువు కాదు. మన మనుస్సను, ఆలోచనను అదుపుచేయగలటమే చదువు. ఈ చదువు ఏకాగ్రతవలన్నే సిద్ధిస్తుంది. ఏకాగ్రత సాధించినవాడు ప్రపంచంలోని అనంత విజ్ఞానాన్ని క్షణంలో గ్రహించగలడు.

సాధారణ మనుషులను తమను తాము స్వతంత్రులుగా తీర్చిదిద్దలేని చదువు కూడ ఒక చదువేనా? మనుషులను దయా, దానబద్ధులుగా తీర్చిదిద్దలేని చదువు వాళ్ళని స్వతంత్రులుగా మార్చలేదు. స్వతంత్రత లేని మనిషి ఎంత చదువరి అయినా పరాన్న జీవే..." చెప్పటం కొనసాగిస్తున్నారు సుబ్బారావు మాస్టారు.

"మాస్టారు, ఆపండి. మీరు ఇలా అనువాదంలా చెప్తే ఎలా? వివేకానందుడు ప్రవచించిన ప్రతి వాక్యానికి స్పష్టమైన అర్థం ఉంది. ఆ అర్థాన్ని మీ జ్ఞానంతో జోడించి వారికి వివరంగా చెప్పండి" అన్నారు.

సుబ్బారావుగారి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. నీళ్ళు నములుతూ నిల్చుండి పోయారు సుబ్బారావు మాస్టారు.

"సరే... తర్వాత నా ఆఫీసు రూముకు రండి" అని పిల్లలవైపు తిరిగి "సాయిరాం నీకు అర్థమయింది అన్నావు. నీకు అర్థమయింది కూడ ఇలాంటిదేనా లేక ఇంకేదనాన్నానా?" అడిగారు హెడ్మాస్టారు శర్మగారు.

సాయిరాం లేచి "నాకు అర్థమయింది చెప్తాను. అది సరిగ్గా ఉందో లేదో నిర్ణయించాల్సింది మీరు" అన్నాడు నిర్భయంగా.

సాయిరాం ధైర్యానికి మిగతా పిల్లలు ఆశ్చర్యపోయారు. వాళ్ళలో చాలామంది హెడ్మాస్టారుగారంటేనే లాగు తడిపేసుకొంటారు. ఇక ఇతర కొత్త మాస్టర్లయితే శర్మగారి ధాటికి ఆయనముందు నిలబడడానికే గజగజలాడ్తారు. సుబ్బారావుగారు సీనియరు మాస్టారు. సెకండరీ గ్రేడ్ అసిస్టెంట్ టీచర్‌గా ప్రొమోట్ అయి అప్పర్ ప్రైమరీ స్కూల్ నుంచి మున్సిపల్ హైస్కూలుకు ఇటీవలే వచ్చారు.

"అయితే చెప్పు" అన్నారు హెడ్మాస్టారుగారు.

"స్వామి వివేకానంద చెప్పిన ప్రతి వాక్యానికి లౌకిక అర్థం చెప్పటం సాధ్యం కాదు. ఆయన శ్రీ రామకృష్ణ పరమహంస గురుదేవుల వద్దకు వెళ్ళేనాటికే పట్టభద్రుడు. ఆ తర్వాత న్యాయశాస్త్ర విద్యాభ్యాసం చేసినవాడు. భగవంతుడుంటే ప్రత్యక్షంగా దర్శించాలనుకొని శ్రీ రామకృష్ణుల వద్దకు

వెళ్ళిన వివేకానందుడు, రామకృష్ణుని శిష్యుడిగా మారి సాధనచేసి, భగవత్ సాక్షాత్కారం పొందిన యోగీశ్వరుడు. ఆ తర్వాత గురుదేవుడి ఆజ్ఞానుసారం అమెరిగా వెళ్ళి చికాగో ఉపన్యాసాలతో ప్రపంచ ప్రసిద్ధుడైనాడు. భారతీయ ఋషిపుంగవులు ప్రవచించిన ఉపనిషత్తులు, వేదాలు వ్యర్థపదజాలం కాదని, అవి సంపూర్ణ సైన్సులు అని ప్రపంచానికి చాటిచెప్పిన తొలి ఋషిపుంగవుడు స్వామి వివేకానందుడు.

కాబట్టి వివేకానందుని మాటలన్నింటికీ ఆధ్యాత్మిక అర్థాలే అన్వయించుకోవాలి. ఆయన అనుభవం ప్రకారం ప్రతి మనిషి పరమేశ్వరుడి రూపమే. ప్రతి ఒక్కరిలోనూ భగవంతుడున్నాడు. భగవంతుడి నిరాకార స్థితే ఈ సృష్టి పూర్వ స్థితి. ఆ స్థితిని జ్ఞానావస్థ అంటారు. ఆ జ్ఞానం నుంచి వచ్చిన కారణంగా మనమంతా జ్ఞానులమే. మనలోనే సమస్త జ్ఞానం ఉంది. అయితే అది తెలుసుకోలేకపోవటం వలననే మనం అజ్ఞాన స్థితిలో ఉన్నామంటారు తాత్త్వికులు, వేదాంతులు.

"మరి మనిషికి ఆ జ్ఞానస్థితి గురించి ఎలా తెలుస్తుంది? పుస్తక పఠనం వలననా లేక విషయసేకరణ వలననా?" అడిగారు సుబ్బారావుగారు.

"నీటి ఆవిరినుంచి వచ్చిన నీరు, నీటినుంచి వచ్చిన మంచు ఒకదానికొకటి వేరు కానట్లే మనమంతా ఈ దేహాలను ధరించని పూర్వస్థితిలో పూర్ణ జ్ఞానులమే. ఆ స్థితిని తెలుసుకోవటమే 'ఎడ్యుకేషన్' లక్ష్యమని వివేకానందులు తెలిపారు. దీనికి 'ఏకాగ్రత' అవసరం.

"అది ఎలానో చెబుతావా?" అడిగారు హెడ్మాస్టారు.

"ఈ సృష్టిలో ఏది సాధించటాన్నయినా మనిషి ఒక్కడే చేయగలడు. బాహ్యంగా ఎన్ని విషయాలు చదువు రూపేణా నేర్చుకొన్నా మనిషికి ఇంకా నేర్చుకోవల్సింది మిగిలిపోతూనే ఉంటుంది. కాని, ఏకాగ్రత ద్వారా మనస్సును అదుపుచేసి, తన దేహ పూర్వస్థితియైన శుద్ధ చైతన్యరూపాన్ని తెలుసుకొంటే ప్రపంచంలోని జ్ఞానం అంతా తెలుసుకొన్నట్టేనని వివేకానంద అభిప్రాయం. అందుకు మనస్సు మన అదుపులో ఉండాలి" అన్నాడు సాయిరాం.

"వివేకానందుడు చెప్పినవన్నీ సరైనవే అని ఇటీవల ఎవరైనా చెప్పారా?'' సాయిరాం విషయ పరిజ్ఞానం ఏమేరకు ఉందో కనుక్కోవటానికి అన్నట్లుగా అడిగారు హెడ్మాస్టారు శర్మగారు.

"నేడు పాశ్చాత్యదేశాల్లోని ఖగోళ శాస్త్రవేత్తలూ, మన రాష్ట్రంలోని బిర్లా ప్లానిటోరియం శాస్త్రవేత్త డాక్టర్ సిద్ధార్థలాంటి వారు ఉపనిషత్తులు, వివేకానంద ప్రవంచించినవి సరైనవేనని అంగీకరిస్తున్నారు. ఈ సృష్టి రూపం గురించి ఖగోళ శాస్త్రవేత్తలు 'బిగ్ బ్యాంగ్' ద్వారా నేడు తెలుసుకొన్నదీ, ఏనాడో ఉపనిషత్తుల్లో చెప్పింది ఒకేవిధంగా ఉన్నట్టు తేలింది ఇటీవలి పరిశోధనల్లో" తెలిపాడు సాయిరాం.

"అయితే ఆ ఏకాగ్రత ఎలా సాధ్యం?" అడిగారు సుబ్బారావుగారు.

''మనిషికి శ్రద్ధవల్లన్నే ఈ శోధన, జ్ఞానం లభిస్తున్నది. దురదృష్టవశాత్తు మన దేశంలో భగవంతుడి గురించిన సంభాషణ, ప్రస్తావన ఎగతాళిగా, సిగ్గుమాలిన పనిగా మారింది. భగవంతుడున్నాడా లేడా అన్నది బుద్ధి వాదంతో తెలుసుకొనే విషయం కాదు. బుద్ధివాదంలో ఉన్నాడు అనీ, లేడనీ కూడ నిరూపించటం సాధ్యమే. అందువలన సాధన వలననే భగవంతుడి ఉనికి గురించి తెలుసుకోవచ్చు. అందుకు

శ్రద్ధ అవసరం. సాధన చేయకుండా భగవంతుడు లేడని వాదించేవారు, భగవంతుడి స్వభావం గురించి అధ్యయనం చేయకుండా నోటికి వచ్చింది చెప్పేవారు సోమరి పోతులు, ఆత్మవంచకులు – అయితే అది వారి జన్మాంతర సంస్కారం. అయినా వారిలో భగవంతుడున్నాడు అన్నది నిజం కనుక వివేకానందుడు వారిని "మూర్ఖదేవోభవ" అన్నారు. కాబట్టి ఏకాగ్రత, శ్రద్ధ, సాధనే మానవుడికి విజ్ఞానాన్ని ప్రసాదిస్తున్నాయి." గుక్క తిప్పుకోకుండా, ఆయాసపడకుండా ముగించాడు సాయిరాం. సాయిరాం చెప్పటం ప్రారంభించినప్పట్నుంచీ, ముగించే వరకూ అందరూ మంత్ర ముగ్ధులై అతని మాటలు విన్నారు.

అతను చెప్పటం ముగించాక హెడ్మాస్టారుగారికి ఈ లోకంలోకి వచ్చిన భావన కలిగింది. సుబ్బారావు మాస్టారుగారి పరిస్థితి కూడ దాదాపు అంతే.

సాయిరాంవైపు ఒకసారి తేరిపారా చూశారు శర్మగారు. అతని కళ్ళలో ప్రహ్లాదుడున్నట్లు తోచింది. ప్రహ్లాదుడు చండా, మార్కుల వద్ద విద్యనభ్యసిస్తూ వారికే ఆత్మ తత్త్వం బోధిస్తాడు. ఒక్కసారి శర్మగారికి వీపు చరిచినట్లయింది. "అంటే ఈ స్కూలు రాక్షస విద్యార్థులకు పాఠం జెప్పే స్కూలా! తనూ, ఇతర టీచర్లు చండామార్కులా?" 'తూ... తూ...' అని తన వీపు తానే చరచుకొన్నారు శర్మగారు.

సాయిరాంను దగ్గరికి పిలిచి అభినందిస్తూ "భేష్... ఇన్ని విషయాలు ఇంత విపులంగా నీకు ఎలా తెలిశాయి సాయిరాం?" అడిగారు హెడ్మాస్టారు శర్మగారు.

"చిన్నప్పట్నుంచి మా నాన్నగారు వేదంలోని విషయాలకు అర్థంతో విడమర్చి చెప్పేవారండి. అందువలన యజుర్వేదం, రిగ్వేదం మా

నాన్నగారి వద్ద నేర్చుకొన్నాను. మా అమ్మగారు స్వామి వివేకానంద భక్తురాలు. ఆయన ఉపన్యాసాలన్నీ నాకు విడమర్చి అర్థమయ్యేలా చెప్పేది ప్రతిరోజు. నిజానికి ఆధ్యాత్మిక శాస్త్రం నేర్చుకొంటే, ఇతర చదువులు అవలీలగా చదవవచ్చునండి. ఈనాటి సైన్సు, లెక్కలు, ఏదైనాసరే ఆధ్యాత్మిక శాస్త్రాల ముందు తేలిపోతాయి. మా అమ్మగారి దయవల్ల నేను ప్రాణాయామం కూడ నేర్చుకొన్నానండీ. కాని, ప్రదర్శనకు కాదు సుమీ! అది నా ఆధ్యాత్మిక సాధనకు" చెప్పాడు సాయిరాం.

హెడ్మాస్టారుగారి కళ్ళు చెమర్చాయి ఆనంద భాష్పాలతో. నిగర్వంగా అమాయకంగా ఉన్నా అతని కళ్ళను మరోసారి చూసి, వెళ్ళిపోయారు శర్మగారు.

2

స్కూలుకు వెళ్ళొస్తే ఎప్పుడూ ఎంతో గలగల సందడిగా కబుర్లు చెప్పే సాయిరాం ఈ మధ్య పెద్దగా ఏమీ మాట్లాడకపోవటం గమనించింది భవానీదేవి.

"నాన్నా సాయిరాం, స్కూల్ విశేషాలు ఏమిటి?" అడిగింది భవానీదేవి ఒక ఆదివారం.

"ఏంలేదమ్మా..." అంటూ మళ్ళీ తను చదువుతున్న పిల్లల భారతం పుస్తకంలో తలదూర్చాడు సాయిరాం.

"అదేం కాదు... ఈ మధ్య నువ్వెందుకో మీ స్కూల్ కబుర్లు చెప్పటం బొత్తిగా మానేశావు. ఏ కారణం లేకుండా నా చిన్నతండ్రిలో ఈ మార్పు ఎందుకొస్తుంది? కన్నతల్లిని నేను ఆ మాత్రం తెలుసుకోలేనా?" అంది భవానీదేవి.

"ఏం కాదు... గురువును ఎదిరించరాదు. గడ్డపార మింగరాదు అన్న సామెతలాగా ఉంది నా చదువు ఈ స్కూల్లో" అన్నాడు సాయిరాం నవ్వుతూ.

"అదేం? ఈ స్కూలు వాతావరణం నీకు నచ్చలేదా?"

"బొత్తిగా... అసలు మాస్టరంటే ఎలా ఉండాలని నువ్వు చెప్పావో అందుకు భిన్నంగా ఉన్నారు. వాళ్ళు తిట్టే తిట్లు, వాళ్ళ ప్రవర్తన, చేసే చేష్టలు నాకెంత జుగుప్స కలిగిస్తాయో! 'గురువు నింద పాపం' అంటావు కదా! అందువలన కళ్ళుమూసుకొని పోయి వస్తున్నా స్కూలుకు" చెప్పాడు సాయిరాం.

"కొంచెం వివరంగా చెప్పు బాబు" అంటూ తల్లి సాయిరాంను దగ్గరకు తీసుకొంది.

"మన వెనకింటి లెక్చరర్‌గారి అబ్బాయి రమేష్ లేడు. పాపం వాడేమో చాలా మేదకుడు. ఎవరి జోలికీ పోడు. నిదానంగా కూడ ఉంటాడు కదమ్మా! పాపం అతన్ని ఇతర కుర్రవాళ్ళు "మంకు ముండాకొడకా", "ముచ్చు ముఖము వాడా", "ఒరే పింకి మోహంవాడా" – అంటూ తిడ్తారు. పాపం అతనేమో ఏడుస్తూ ఇంటికి వస్తాడు రోజూ. కానీ, స్కూల్లో మాస్టారుకి, ఇంట్లో అమ్మనాన్నకు చెప్పమంటే మటుకు చెప్పడు. అదేమిటంటే, "వాళ్ళు ఇవాళ ఒకసారి జోక్యం చేసుకుంటే ఈ సమస్య పరిష్కారం అవుతుందని గ్యారంటీ ఏముంది? వీళ్ళు ఇంకా ఎక్కువ చేస్తే, అప్పుడేం చేయాలి? రోజూ మా వాళ్ళని రమ్మనటం బాగోదు కదా! కొంతకాలం మనమే ఓర్చుకొంటే సరి! వాళ్ళ దారిన వాళ్ళే పోతారు" అని అంటాడు అమ్మా. మరేమో నన్ను కూడ అప్పుడప్పుడూ తిడుతుంటారు అని చెప్పాడు సాయిరాం.

"అది సరే! నువ్వు కనీసం మాస్టారుగారికి ఎందుకు చెప్పలేదు?"

"ఏం చెప్పను? వాళ్ళు తిట్టే తిట్లన్నీ మాస్టారుగారు రోజు మమ్మల్ని సంబోధించేవే. మాస్టారు అయి ఉండి ఆయనే సభ్య సమాజం అనకూడని తిట్లు తిడుతుంటే, ఇంక ఆయనకు చెప్పి ప్రయోజనం ఏమిటి? అందుకే చెప్పలేదు. అయినా ఈ స్కూలు మాస్టర్లకు చదువుకన్నా బూతులు ఎక్కువ వచ్చులాగుంది. పైగా, పిల్లలకు పాఠం చెప్పటం కన్నా వాళ్ళ సొంత విషయాలంటేనే చాలా ఎక్కువ ఇష్టం. మాకు పాఠం చెప్పేది పది నిమిషాలు. పొరుగు క్లాసు టీచర్‌తో మాట్లాడేది అరగంట. ఈ లోపల క్లాసు మానిటర్ మాపై రాసిన ఫిర్యాదులన్నింటినీ విచారించకుండానే మమ్మల్ని పట్టుకు చావ చితక కొట్టటం. అబ్బ స్కూల్లా లేదు. నరకం లాగుంది అనుకో. కృష్ణ, బలరాములు సాందీపుడి ఆశ్రమంలో చదువుకొనే రోజుల్లోని విషయాలు నువ్వు చెప్తుంటే నాకు స్కూళ్ళపై ఎంత గౌరవం ఏర్పడిందో, ఇప్పుడు అంతా తుడిచిపెట్టుకు పోతోంది" అన్నాడు సాయిరాం.

"భగవంతుడా! పసిపిల్లల హృదయాలపై చిన్నప్పుడే రాక్షసముద్రలు పడితే ఈ సంఘంలో ముందు ముందు అరాచకమే కదా! చక్కటి కథలు, కబుర్లతో పాఠాన్ని పిల్లలకి చెప్పి, నేర్పుగా వాళ్ళని ముందుకు నడిపించవలసిన ఈ ఉపాధ్యాయులు ఇలా నానాటికీ ఎందుకు పతనమవుతున్నారు. మానసిక, శారీరిక హింస ద్వారా, భయోత్పాదనలు పిల్లల్లో కలిగించటం ద్వారా పిల్లలకు విద్యాబోధన సులువుగా చేయవచ్చుననే ఈ దురభిప్రాయం ఎలా పోతుంది వీరిలో" అంటూ గద్గద కంఠంతో వివేకానందుడి ఫొటోవైపు దీనంగా చూసింది భవానీదేవి. ఆవిడ కంటినుండి రెండు కన్నీటి చుక్కలు నేలపైకి జారాయి. తల్లిని చూసి సాయిరాం కళ్ళు కూడ చెమర్చాయి.

3

మాస్టర్ల మీటింగ్ జరుగుతోంది. హెడ్మాస్టరు శర్మగారు ప్రసంగానికి ఉద్యుక్తులయినారు.

"మీ మీ జీతాల సమస్యలు, ప్రొమోషన్ల సమస్యలు, కుటుంబ సమస్యలు మీకు అత్యంత ప్రధానంగా కనబడటం నేను కాదనను. ఎందుకంటే, వృత్తిపరంగా నేనూ మీలో ఒకడ్నే. కాని, వృత్తిపట్ల మీకు ఎంతమాత్రం చిత్తశుద్ధి ఉందో మీరే ఎందుకు ఆత్మ పరిశీలన చేసుకోరో నాకు బోధపడదు. ఎన్నిసార్లో ఇలాంటి మీటింగ్‌లలో మిమ్మల్ని హెచ్చరించాను. కాని, మీలో మార్పు రాలేదు. కాని, మీరు మాత్రం పిల్లలో మార్పు రాకపోతే వాళ్ళని చావచితకబాదుతారు. ఆ క్షణంలో మీరు కొట్టే తీరు వీడియో తీస్తే మీకు సిన్మాలో పచ్చి నెత్తురు తాగే విలన్లకు ఏమీ తేడాలేదని స్పష్టంగా తెలుస్తుంది. భయపెట్టి పిల్లల్ని చదివించాలనుకోవటం చాలా పెద్ద నేరం. ఆ పని చేయటానికి బి.ఎస్సీ., బి.ఏ., బి.ఇడి.లు అనవసరం కూడ. ఒక్కో క్లాసులో ఒక పెద్దపులిని, సింహాన్ని, ఎలుగుబంటిని కూర్చోబెడితే మీకన్నా ఎక్కువ వాటికే భయపడి పిల్లలు బాగా చదివే అవకాశం ఉంది. పిల్లలకు అర్థంకానిది చెప్పటానికి నేర్పు, ఓర్పు చాల అవసరం. పది నిమిషాల్లో పాఠం ముగించి, స్వంతపనులు, ముచ్చట్లు చెప్పుకొనే మీరు ఉపాధ్యాయ వృత్తికి ఏవిధంగా అర్హులు? డబ్బు సంపాదించుకొనేందుకు పుస్తకాలు రాసి, గైడ్లు రాసి, ట్యూషన్లు చెప్పి మీరు ఈ వృత్తికి తీరని అన్యాయం చేస్తున్నారు. ఒకప్పుడు 'బతకలేని బడిపంతులు' అన్న సామెతను, నేడు 'బతకనేర్చిన బడిపంతులు' సామెతగా మారుస్తున్నారు. దయచేసి ధనార్జనా సంకల్పం ఉన్నవారు ఈ వృత్తినుంచి వెళ్ళిపోండి. బయట అనేకానేక వ్యాపారాలు ఉన్నాయి.

వాటిని చేసుకోండి. ఈ స్కూలును చిత్తశుద్ధితో నడిపే నాకు, ఇతర మాస్టర్లకు మీలో కొందరి వ్యాపార ప్రవృత్తి తీరని ప్రతిబంధకం అవుతున్నది" ఆవేశంగా అన్నారు హెడ్మాస్టరు శర్మగారు.

శర్మగారి మాటలకు కొందరి ముఖాలు వాడిపోగా, మరికొందరు సంతృప్తిగా నిట్టూర్పు విడిచారు.

సుబ్బారావుగారు, రామకృష్ణరావు, గురుమూర్తి, హనుమంతరావు గార్లు మాత్రం ఏదో గొణిగారు.

తర్వాత రాఘవ నారాయణ మాస్టారుగారు ప్రసంగించవలసి వచ్చింది.

ఆయన హెడ్మాస్టరుగారితో "రాబోయే సైన్స్ ఫెయిర్‌లో పిల్లలతోటి చేయించ వలసిన రకరకాల మోడల్స్‌కు హెడ్మాస్టరుగారు తగిన నిధులు సమకూర్చాలి. ఎప్పుడూ పిల్లల ఖర్చుతోనే సైన్సు మోడల్స్ చేయించవలసి రావటంతో తగిన కొత్త మోడల్స్‌గాని, కొత్త ప్రయోగాలుగాని చేయించను వీలు కావటం లేదు" అన్నారు.

"నిజమే. ఆ విషయం నాకూ తెలుసు. ప్రభుత్వం నుంచి నిధులు సకాలంలో సమకూరటం లేదని, "అదిగో" అంటే "ఆర్నెల్లని" మీకు తెలియంది కాదు. కాని, ఏ ఏటికి ఆ ఏడు కలెక్టరుగారు, డీ.ఈ.ఓ. గారు మాత్రం సైన్సు ఫెయిర్‌కు మీరు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయాలని అంటారు. అందువలన నేను మీకోసం రెండు ప్రతిపాదనలు చేస్తున్నాను.

ఒకటి – సైన్సు ఫెయిర్ కోసం పిల్లలకు నూతన సైన్సు మోడల్స్ తయారు చేయటానికి ప్రభుత్వం తగిన నిధులు మంజూరు చేయాలని డీ.ఈ.ఓ. గారి దగ్గరికి గుంపుగా వెళ్ళి వినతిపత్రం సమర్పించటం.

రెండవది – ప్రభుత్వ నిధులు వచ్చేదాకా వేచి ఉండకుండా, మీరంతా తలా రెండు వందలు మీ జీతం నుంచి వెచ్చించి అవసరమైన ప్రయోగాలు పిల్లలతో చేయించండి. ఇందుకు నావంతు రెండు వందలు నేను ఇస్తాను. మీరు పెట్టిన ఖర్చుకు బిల్లులు నాకు అప్ప జెప్పండి. ప్రభుత్వం నుంచి ధనం రాగానే మీమీ బిల్లులకు నేను డబ్బు చెల్లిస్తాను. సరేనా" అన్నారు శర్మగారు.

కొంతమందికి తమ జేబు డబ్బు ముందు వదులుతుందని బాధ కలిగినా రాష్ట్ర ప్రభుత్వ, పంచాయతీ, మున్సిపల్ ఉద్యోగులకు ఈ రకమైన చేతి చిలుము వదలటం ఎప్పుడూ ఉన్నదేనని తలూపక తప్పింది కాదు.

మరికొందరికి స్కూలుకు పేరు వస్తే, భవిష్యత్తులో ఉపాధ్యాయ వృత్తికి, తమకు మంచి గౌరవం ఉంటుందన్న నిజాయితీ మనస్తత్వం వలన శర్మగారి ప్రతిపాదనలు నచ్చాయి.

ఇంతలో వెంకట్రావు, సుందరం మాస్టార్లు లేచి "ప్రయోగాల విషయంలో, మోడల్స్ విషయంలో మాకు స్వేచ్ఛ ఉందా? అందుకు హెడ్మాస్టరుగారి సూచనలు ఏమైనా నిర్దిష్టంగా ఉన్నాయా?" అని అడిగారు.

"ఆ విషయానికే వస్తున్నాను. ఇటీవల సైన్సురంగం బాగా అభివృద్ధి చెందింది. అయినప్పటికీ క్రితంలో లాగానే గత ఏడాది కూడ ఏనాటిదో విలియం హార్వే రక్తప్రసరణ మోడల్, గుండె కొట్టుకొనే తీరు, నిప్పులేని పొగ, వింతమనిషి – ఇలాంటివే పెడ్తూ వస్తున్నారు. ఇకపై అలాంటివి కాదు, కొత్తవి రూపకల్పన చేయండి. న్యూ సైంటిస్ట్, సైంటిఫిక్ అమెరికన్,

సైన్స్ అప్‌డేట్ పత్రికలను నేను ఈ స్కూలుకు వచ్చినప్పట్నించీ తెప్పిస్తూనే ఉన్నాను. కాని, ఏనాడు మాస్టర్లు వాటిని మన లైబ్రెరీ నుంచి తీసుకొని చదివిన చిహ్నాలు కనబడవు. ఈసారి పాత, కొత్త వాల్యూమ్స్ తిరగేసి వాటినుంచి చిన్న, చిన్న ప్రయోగాలు తయారు చేయించండి. అవసరమైతే మహీధర నళినీ మోహన్‌గారి పుస్తకాలు తిరగేయండి. కాని, వాటిని అందరూ ఫాలో అవుతారు కనుక వాటినుంచి ఏవీ సెలెక్ట్ చేయవద్దు. దాన్ని గైడెన్స్‌కు తీసుకోండి. సరేనా!" అని శర్మగారు మీటింగ్ ముగిసినట్లుగా తెలియపర్చి, లేచారు.

అప్పటికే ఆలస్యమైన కారణంగా టీచర్లు అంతా బిలబిలా బయటికి వచ్చారు.



4

సాయిరాం స్కూలుకు యధావిధిగా వెళ్తూ వస్తున్నాడు. ఆ సరికే స్కూల్లో సాయిరాం జ్ఞాపకశక్తి, సూక్ష్మబుద్ధి, గ్రహణశక్తి గురించి చాలామంది మాస్టర్లు, పిల్లలు ఆశ్చర్య పడటం ప్రారంభమైంది.

ఆ రోజు సాయిరాం మాస్టారుగారు చెప్పిన పాఠం తీసి చదువుకొంటున్నాడు క్లాసులో.

వెనుక బెంచీలో కొందరు పిల్లలు కొంచెం పెద్దగా మాట్లాడుకొంటున్నారు.

“రేయ్! మా నాన్న ఉత్త వెధవరా! నాకు మా నాన్నంటే ఒళ్ళు మంట. నిజానికి పిసినారివాడనుకో. మొన్న సత్యప్రసాద్‌కు వాళ్ళ నాన్న ఎలక్ట్రానిక్ వాచ్ కొనిచ్చాడు కదా. దాని ఖరీదు ఎంత? పాతిక రూపాయలు. నేను మా నాన్నను ‘నాకు కొనియ్యి నాన్న’ అని అడిగాను. వెంటనే “వెధవా, వేలేదు లేవు... నీకు ఇప్పుడే ఎలక్ట్రానిక్ వాచ్ ఏమిట్రా? నాకు మా నాన్న డిగ్రీ అయితేగాని కొనివ్వలేదు. పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే చంపేస్తాను” అన్నాడు. ఒరే నువ్వు చెప్పరా!” మీ నాన్నకూడ ఇట్లంటే నువ్వు నాలాగా ఫీలవ్వవూ” అన్నాడు ప్రమోద్.

“అవున్రా! నాకు మా నాన్నని చూస్తే చంపేయాలనిపిస్తుంది. గూండా నెం.1 సిన్మా చూశావా? అందులో హీరో వాళ్ళ నాన్న ఇలానే అంటే ఏం చేస్తాడు. అర్ధరాత్రిపూట దొంగతనానికి వాళ్ళ నాన్న గదిలోకి వెళ్తాడు. అప్పుడు వాళ్ళ నాన్నకు మెలకువ వచ్చి చూసేసరికి వీడు తన చొక్కా జేబులోంచి దొంగతనం చేయటం కనబడుతుంది. వాడ్ని గబగబ లేచి పట్టుకోబోగా వాళ్ళ నాన్నపై రోకలిబండని విసిరేసి పారిపోతాడు.

ఆ తర్వాత టైటిల్స్. వాడే గూండా నెం. 1. మన హీరో చిరంజీవి. చూశావా? అట్లా మా నాన్నని కూడ మెత్తగా తన్నాలనిపిస్తుంది" అన్నాడు సంజయ్ మధ్య మధ్య సిన్మా మ్యూజిక్‌ను నోటితో అనుకరిస్తూ.

"భలే, భలే చెప్పావురా! ఎప్పుడు చూశావు గూండా నెం. 1. నేను చూడాలిరా! నాకు మా అమ్మంటే హడల్ రా! ఎప్పుడూ చదువు, చదువూ అంటూ చంపుతుంది. నాకేమో సిన్మాలన్నా, టీ.వీలన్నా, కబుర్లన్నా ఉన్న ఇంట్రస్టు చదువుమీద ఉండదు. ఇక కొట్టి కొట్టి చంపుతుందనుకో. ఇవాళ పాఠం ఒప్పజెప్పకపోతే వచ్చేవారం సిన్మాకి పోనీయదు. పైగా ఇంట్లో కూడ టీ.వి. చూడనీయదు. భలే చావొచ్చి పడిందిలే ఈ అమ్మా, నాన్నలతో. హాయిగా మనం కూడ వాళ్ళలా త్వరగా ఎప్పుడు పెద్దవాళ్ళం అయిపోతామో!" అన్నాడు.

ఈ ముగ్గురూ ఇలా మాట్లాడుకోవటం వారి వెనుకనే నుంచొని క్లాసులో పిల్లల ప్రవర్తనను గమనిస్తున్న రామానుజం మాస్టారుగారు విన్నారు.

రామానుజం మాస్టారుగారికి ఒక అలవాటుంది. ఆయన ప్రతి క్లాసులో అరగంటసేపు పాఠం చెప్పాక పదిహేను నిమిషాలు వాళ్ళని స్వేచ్ఛగా వాళ్ళ ఇష్టానికి వదిలేసినట్లు నటిస్తారు. కాని, ఆ సమయంలో వాళ్ళమధ్యనే అటూ ఇటూ తిరుగుతూ, స్వేచ్ఛనిస్తే, ఒక్కొక్కడు ఎలా ప్రవర్తిస్తాడో క్లాసులో వారి వైఖరి ఎలా ఉంటుందో క్షుణ్ణంగా పరిశీలిస్తారు. దీన్నిబట్టి పిల్లల్లో ఒక్కొక్కరి నిజాయితీ, ప్రవర్తన, ఆలోచనా వైఖరి ఎలా ఉందో అంచనా వేస్తారు ఆయన.

ఈ పిల్లల ముచ్చట్లు విన్న రామానుజం మాస్టారుగారికి మనస్సులో ఎక్కడో కెలికినట్లయింది. వీళ్ళ ప్రాయం ఎంత? వీళ్ళ చదువెంత?

తల్లిదండ్రులపట్ల వీళ్ళకు ఉండవలసిన అభిమానం ఎంతటి అధమస్థితికి దిగజారింది. ఈ విషయంపై పిల్లలను ఆలోచింపజేయాలి అంటే ఎలా అని కాసేపు ఆలోచించారు.

ఒక్క రెండు, మూడు నిమిషాల తర్వాత డస్టర్‌తో టేబిల్‌పై కొట్టి 'సైలెన్స్' అని గట్టిగా అరిచాడు రామానుజం మాస్టారు.

అంతా క్షణంలో స్తబ్దులైనారు.

"నేనిప్పుడొక ప్రశ్న వేస్తాను. ఇంట్లో అమ్మా, నాన్న; స్కూల్లో మాస్టర్ల మాట పిల్లలు ఎందుకు వినాలో మీకెవరికన్నా తెలుసా, తెలిస్తే చేతులెత్తండి" అడిగారు రామానుజం మాస్టారు.

ఇద్దరు, ముగ్గురు చేతులెత్తారు.

"ప్రకాశం నువ్వు చెప్పు" అడిగారు మాస్టారు.

"చిన్నప్పట్నించి, అంటే నేను పుట్టినప్పట్నించి కళ్ళు తెరిచి ఈ ప్రపంచాన్ని చూస్తున్న నేటి వరకూ అమ్మా, నాన్న నన్ను భద్రంగా పెంచి జాగ్రత్తగా కాపాడి పెద్దచేశారు కదండీ! మరి అటువంటి అమ్మా, నాన్నపట్ల నేను కృతజ్ఞతగా ఉండక, వారు చెప్పింది వినలేదనుకోండి, అప్పుడు వాళ్ళు బాధపడితే బాగుండదు కదండీ. నన్ను కన్నవాళ్ళని బాధపెడితే నాకేం లాభం. అందుకని అమ్మా, నాన్న చెప్పినట్లు వినాలండి. అట్లాగే మాస్టార్లు కూడానండి. మనం చదువుకోవడానికే కదండీ స్కూలుకొచ్చేది. మాస్టర్లమాట విననిపక్షంలో స్కూలుకు రావటం వేస్ట్ కదండి. అందువలన మాస్టార్ల మాట వినాలండీ" చెప్పాడు ప్రకాశం.

"సర్లే, కూర్చో. నెక్స్ట్ విజయ్! నువ్వు చెప్పు"

"ప్రకాశం చెప్పిందే నేను చెప్పాలనుకొన్నానండి. వాడు చెప్పేశాడుగా.

మళ్ళీ ఇక నేను చెప్పటం ఎందుకు?" అన్నాడు విజయ్ అమాయకంగా.

అందరూ వాడి సమాధానం విని గొల్లున నవ్వారు. మాస్టారుకు కూడ నవ్వు ఆగలేదు.

చివరగా మాస్టారు సాయిరాంను లేపి, "నువ్వు చెప్పవోయ్ సాయిరాం" అన్నారు.

"మనం అమ్మా, నాన్న చెప్పింది వినటం, మాస్టర్లు చెప్పింది అర్థం చేసికోవటం మన మంచికేనండి. మనం అమ్మా, నాన్న, మాస్టార్ల మాట వినటం వలన అమ్మా, నాన్నలు సంతోషపడితే పడవచ్చు. కాని, వారి మాటలు వినటం వలన లాభపడుతున్నది మనమేనని గుర్తుంచుకోవాలి. అసలు మూల సమస్య తల్లిదండ్రులపట్ల కృతజ్ఞతగా ఉండాలా? వద్దా? అన్నది కాదు. నేర్చుకోవటం (లెర్నింగ్) వలన మనిషికి లాభమేగాని కీడు లేదు. అందువలననే 'వినదగునెవ్వరు చెప్పిన వినినంతనే వేగిరపడక...' అన్న పద్యం మా అమ్మ ఎప్పుడూ నాకు చెబుతూ ఉంటుంది. అసలు తల్లీ, తండ్రే కాక, ఎవ్వరు చెప్పినా వినటమే మంచి లక్షణం. వినటం వలన, నేర్చుకోవటం వలన మనకు తెలివితేటలు అభివృద్ధి చెందుతాయి. సమస్యలు లేకుండా, రాకుండా జీవించ గలుగుతాం. మాస్టర్లు చెప్పినా, అమ్మానాన్న చెప్పినా మనం తు.చ. తప్పకుండా వినాలనేది ఇందుకే. ఎందుకంటే, మనకు సమస్యలు లేకుండా జీవితం హాయిగా సాగిపోతుంది. వాళ్ళ అనుభవాన్ని మనం ఆదర్శంగా తీసుకోవాలి. దానికి కావలసింది వినయం. వినయం, నేర్చుకోవాలన్న తపన వలన మనిషి జంతువుల నుంచి విడిగా గుర్తింపు పొందుతాడు. 'విద్యా దదాతి వినయం' అని అందుకే అంటారని మా అమ్మ చెప్తుంది. వినయం లేనివాడు విద్యగూడ పొందలేడు. వాడిని భర్తృహరి 'వింత పశు

వు' అని వర్ణించాడు. మనకు చదువు నేర్పే తొలి వ్యక్తి తల్లి. 'నిప్పు ముట్టుకోవద్దు నాన్నా కాలుతుంది' అని తల్లి చెప్పిన మాట తొలినాడు వినబట్టే ఇవాళ మన చేతులు మనకు దక్కాయి. అందుకే తల్లి తొలి గురువు. తల్లిదండ్రులను దూషించటం వినాశనానికి హేతువు" చెప్పాడు సాయిరాం.

"విన్నార్రా!" అంటూ తాను ఇందాక చూసిన తల్లిదండ్రులను దూషిస్తున్న పిల్లలవైపు సైగచేస్తూ అడిగారు రామానుజం మాస్టారు.

వాళ్ళు తలూపారు. "అర్థమయిందా! సిన్మాల్లో గూండాల్లా మీకు మీ అమ్మ నాన్నతో యుద్ధం చేయటం గొప్పనిపిస్తోందా? మిమ్మల్ని చక్కగా తయారుచేసి, కావలసిన పుస్తకాలు కొనిచ్చి, చదువుకోమంటే పందికొక్కులుగా అమ్మానాన్న ఆర్జితమైన టిఫిన్ తిని వాళ్ళనే దూషిస్తారా! పైగా సిన్మాల్లో గూండా చేసిన పనులే మీకు సంతోషంగా ఉన్నాయా? సిన్మాలో గూండా సంఘానికి క్యాన్సర్‌వంటి వాడు. వాడివల్ల మీ అక్కచెల్లెళ్ళకు, ఆఖరికి వాడి సొంత తల్లికి, భార్యకు కూడా క్షేమం జరగదు. ఎప్పుడూ ప్రమాద భయమే. అలాగే మీకు గూండా కావాలనుకుంటే, మీరు క్యాన్సర్ వ్యాధి వస్తే బాగుండునని కోరుకోండి. మీకు క్యాన్సర్ వస్తే ఎంతో, మీరు గూండాలైతే మాకు అంతే తెలిసిందా?" గర్జించారు రామానుజం మాస్టారు.

పిల్లలంతా ఆ ముగ్గురి ముఖాలవంక అసహ్యంగా చూశారు. వాళ్ళ ముఖాలు పాలిపోయాయి.

"మరెప్పుడన్నా స్కూల్లోగాని, బయటగాని ఇలాంటి సంభాషణ చేశారో మీకు టీసీ ఇచ్చి పంపుతాను తెలిసిందా! చీడపురుగుల్లారా!" మరోసారి క్రోధంతో రెంకె వేశారు రామానుజంగారు.

ఆయన క్రోధాగ్నికి స్కూలు భస్మీపటలమవుతుందేమోనని పిల్లలు భయపడ్డారు. ఆయన కళ్ళు మండే అగ్నిగోళాల్లా ఉన్నాయి.

అలా మాట్లాడిన పిల్లల్లో ఒకడు మాస్టారు కొడతాడేమోనని భయపడి లాగు తడిపేసుకున్నాడు.

"ఛీ... పిరికి వెధవల్లారా. పిట్ట కొంచెం కూత ఘనం. ఫో, క్లాసు బయటికి వెళ్ళు! లంచ్‌బెల్ వరకూ ఎండలోనే నుంచో. అప్పుడు తెలుస్తుంది తల్లిదండ్రులు నీకు కల్పిస్తున్న నీడ, రక్షణ గురించి" అరిచారు మాస్టారు.

తొలిసారి రామానుజం మాస్టారులాగా మంచిని ప్రోత్సహించే ఒకరిని ఆ స్కూల్లో చూడగలిగినందుకు సాయిరాంకు ఎంతో సంతోషం కలిగింది.

5

సాయిరాం అంటే ఇప్పుడు స్కూల్లో రెండు వర్గాలు. కొందరు సాయిరాం అంటే తగని ఇష్టం. అతనంత శ్రమజీవి, మేధస్సుకల అబ్బాయి అరుదని కొందరంటే, కొందరు "ఆ అబ్బాయికి అతి తెలివి. వేలెడు లేడుగాని వయస్సుకు మించిన మాటలు, తర్కం, అవ్వ!" అని మరికొందరు ఎద్దేవా చేశారు.

సాయిరాంకు అన్నింట్లో ఫస్ట్ మార్కులే. ఎంత తగ్గించి మార్కులు వేసినా అతనికంటే వేరే పిల్లాడికి ఎక్కువ మార్కులు వస్తే ఎక్కడ పెద్ద గందరగోళం జరుగుతుందోనని అతనంటే గిట్టని మాస్టర్లకు కూడ భయం కలగసాగింది.

మొన్నోరోజు ఇంటర్నల్ ఎసైన్‌మెంట్‌లో బొద్దింక శ్వాసక్రియ గురించి సాయిరాం రాసిన జవాబుకు మూడు మార్కులువేసి, విజయ రాఘవన్‌కు

తొమ్మిది మార్కులు వేశారు జనార్ధన్ మాస్టారు.

"తనకంటే ఎక్కువ మార్కులు వచ్చిన జనార్ధన్‌ను అభినందించి, నా సమాధానాలతో నీ సమాధానాలు పోల్చి చూసుకొని ఇస్తాను. ఒక్కసారి ఇస్తావా?" అని ప్రేమగా బ్రతిమాలాడు సాయిరాం.

"ఉ... ఉ... ఛస్తే ఇవ్వను. నువ్వు కుళ్ళుబోతోడివి. మాస్టారుకు ఏదో చెప్పి నాకు వచ్చిన మార్కులు తగ్గించటానికా?" అన్నాడు విజయ రాఘవన్ ఛీమిడి ముక్కు ఎగపీలుస్తూ.

"ఛ... ఛ... అటువంటిదేమీ లేదు. నన్ను నేను సరిదిద్దుకోకపోతే భవిష్యత్తులో నష్టపోయేది నేనే కదా! నువ్వు నాకన్న మంచిగా ఏం రాశావో కనుక్కుందామని అడిగాను అంతే" అన్నాడు సాయిరాం.

"పాపం ఆశ. నేను కష్టపడి ట్యూషన్ చెప్పించుకొని, బోలెడంత డబ్బు తగలేస్తే నాకు మార్కులు వస్తున్నాయి. నా జవాబులు చూసి నువ్వు నాలా తయారై అప్పళంగా మార్కులు కొట్టేద్దామనా? అదేం కుదరదు" అన్నాడు విజయ రాఘవన్.

"సర్లే. నీ ఇష్టం" అని తను ఎక్కడ తప్పు రాశాడో అచ్చు పుస్తకం చూసి సరిపోల్చుకోసాగాడు సాయిరాం.

ఇంతలో సాయిరాం అంటే అభిమానమున్న కుర్రవాడు సాయిరాం దగ్గరికి జరిగి చెవిలో – "నువ్వేమీ బాధపడవద్దు. రాఘవన్ రాసిన ఆన్సర్ టెక్స్టుబుక్‌లోది కాదు. వాళ్ళకు ట్యూషన్లో మాస్టారు బొద్దింక శ్వాసక్రియ గురించి పేజీ వ్యాసం చెప్పాడు. పదవ తరగతి వాళ్ళకున్నన్ని విషయాలు వాడి వ్యాసంలో ఉన్నాయి. అంతేగాక తన ట్యూషన్ స్టూడెంట్ గదా అందుకొరకు వాడికి ఫస్టు మార్కు ఇచ్చాడు. నువ్వు ఊరుకోకు.

ఊరుకొంటే ముందు ముందు నువ్వంటే గిట్టని ప్రతి మాస్టారు నీకు సున్నా మార్కులు వేయటం మొదలుపెడ్తాడు" అని చెప్పాడు.

సాయిరాంకు అతను చెప్పిన మాటలు నచ్చాయి. ఇంటర్వెల్‌లో తన సమాధానం పేపరు, అచ్చుపుస్తకం తీసుకెళ్ళి హెడ్మాస్టరు శర్మగారికి చూపించాడు సాయిరాం.

ఆయనకు సాయిరాం చూపిన సమాధానం, అచ్చుపుస్తకంలో ఉన్నా సమాధానం ఒకే రీతిలో ఉన్నా, అతనికి తక్కువ మార్కులు మాస్టారు ఎందుకు వేశారో క్షణంలో బోధపడింది.

"ఓకే సాయిరాం. నీ పని అధర్మాన్ని నా దృష్టికి తేవటం. ఆపై సంగతి నేను చూసుకొంటా సరేనా!" అంటూ అతని తల నిమిరి పంపించేశాడు హెడ్మాస్టారు శర్మగారు.

అంతే. ఆ తర్వాత మాస్టర్లకు సాయిరాంకు తక్కువ మార్కులు వేస్తే ఎందుకు అలా వేశారో వివరణ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి ఇరకాటంతో కుడితిలో ఎలుకలా కొట్టుకొంటున్న మాస్టర్లలో సుబ్బారావు, జనార్ధన్, రామకృష్ణరావు, హనుమంతరావులాంటి వారు కొందరు. వాళ్ళకు సాయిరాం విద్యనభ్యసించే పిల్లాడు కాదు. విష్ణువుతో వైరం బెట్టుకొన్న హిరణ్యకశ్యపుడికి ప్రహ్లాదుడిలా, సాయిరాం వీరికి జన్మ శత్రువు.

సాయిరాంను తిట్టడానికి, వీలైతే కొట్టడానికి వీరికి సందు దొరకటం లేదు. సాయిరాం ఏదైనా తప్పు చేయాలి, అది వీరి కంటపడాలి. సాధారణంగా మేధస్సు తక్కువైన మాస్టర్లు, ఆ మాటకొస్తే సగటు మనుషులు మాత్రమే హింసకు పాల్పడుతుంటారు. అటువంటి వారికి క్షమించే మనస్తత్వం ఉన్నా సాయిరాంలాంటి వారిని చూస్తే వారికి

మరింత మండిపోతుంది. హింసావాదులు సాధారణంగా ప్రతిహింసను ఊహిస్తారు. కాని, ప్రతిఘటన బదులు ఊహించని దయ, ఉదాసీనత వారికి ఎదురైతే వారనుభవించే బాధ అంతా ఇంతా కాదు. ప్రస్తుతం సాయిరాంతో అదే సాగుతోంది.

సాయిరాంపై కక్ష తీర్చుకోవటానికి సాయిరాంకు ఇరవై, ముప్పై లెక్కలు హోంవర్క్ ఇస్తారు కోటీశ్వరరావు మాస్టారు. సైన్సు బొమ్మలు, రికార్డు నోట్సులు ఒక్కసారే ముప్ఫయిదాకా గీచుకురమ్మంటాడు జనార్ధన్ మాస్టారు. ఇంగ్లీషు పాఠానికి ఏరోజు పాఠానికి ఆరోజు ప్రశ్నలు, సమాధానాలు ఒప్పజెప్పాలంటాడు సుబ్బారావు మాస్టారు.

మిగతా పిల్లలకు కూడ పేరుకు ఇంతే హోంవర్కు ఇచ్చినా వారు హోంవర్కు చేయకపోతే పెద్దగా మందలించకపోవటం సాయిరాం గమనించకపోలేదు.

కాని, తాను పొరబాటున డేట్ వేయకపోయినా, చాచి చెంపదెబ్బ కొట్టటం, సరిగ్గా చేసిన లెక్కలను "నువ్వే చేశావా? మీ అమ్మ చేసిందా?" అంటూ పదిమంది పిల్లలముందు అవహేళన చేస్తూ మాట్లాడటం సాయిరాం గ్రహించకపోలేదు.

సాయిరాం తన తల్లితో మాస్టర్ల ప్రవర్తన గురించి చర్చించకపోలేదు.

"మానసికంగా బలహీనులైనవారే వేరేవారిని హింసిస్తారు నాన్నా! మేధావి అయిన మానవుడికి తన సొంతంగా ఆనందాన్ని పొందటానికి భగవంతుడు జ్ఞానాన్నిచ్చాడు. నిరహంకారంగా సరస్వతి ముందు చేతులు ముడిచి నిల్చొని విజ్ఞానానందాన్ని నాకు ప్రసాదించు అని ప్రార్థించే శక్తి ఒక్క మనిషికే ఉంది. కుక్కలు, నక్కలు మనలా చదవలేవు. మాట్లాడ లేవు. నేర్చుకోలేవు. మనలా అవి సమదృష్టితో నల్గుర్ని ప్రేమించలేవు.

ఉదాహరణకు కుక్క ఒకరినో, ఇద్దరినో యజమానులనుకొన్నవారిని ప్రేమిస్తుంది. వారిపట్ల విశ్వాసం చూపుతుంది. దానికి ఆహారం పెట్టినందుకు ప్రతిఫలంగా అది ఆ పని చేస్తుంది. కాని, మనిషి కుక్క కాదు. అంతకంటే అధికం. అందువలన ప్రతిఫలం ఆశించక అందరిపట్ల ప్రేమ చూపాలి. చూపగల్గాలి. మనిషికి ఉండాల్సింది కుక్క విశ్వాసం కాదు. దైవికమైన ప్రేమ. దురదృష్టవశాత్తు ఉపాధ్యాయ వృత్తిలో ఉండే మాస్టర్లు అనేకమంది తమ ప్రత్యర్థుల ట్యూషన్ పిల్లలకు అనవసరంగా మార్కులు కోయటం, తప్పించటం, తమను ప్రశ్నించిన విద్యార్థులను ఫెయిల్ చేయటం అనే ఒక క్షుద్ర క్రీడకు పూనుకొంటున్నారు. స్కూళ్ళనుంచి ఈ జబ్బు యూనివర్సిటీలదాకా పాకిందిరా సాయిరాం! దీని గురించి బాధపడకు. నీ కర్మలు నువు నిర్వర్తించు. ఫలితం భగవంతుడికి వదిలేయి. ఫలితంపై హక్కులేదని నీకు ఖచ్చితంగా తెలిసి, ఫలితం గురించి బాధపడకు. కర్మల అర్థం జ్ఞానం. కర్మల్లో ఆనందం సంపాదించు కోవాలే గాని, కర్మఫలంతో కాదు... ధైర్యంగా ముందుకు సాగు" అంది భవానీదేవి సాయిరాంతో.

సాయిరాంకు తల్లి మాటలు ఎంతో ఉపశమనాన్నిస్తాయి. సంతోషంగా తన కర్తవ్యం తాను నిర్వర్తించి నిద్రపోతాడు. కొందరు మాస్టార్ల వేధింపువలన తన బిడ్డ ఇదివరకుకన్నా ఎక్కువ శ్రమిస్తున్నాడని భవానీదేవి కన్నీళ్ళు పెట్టుకొంది.

సాయిరాంపై దాదాపు ఆర్నెల్లపాటు నిరాఘాటమైన ఒత్తిడి తెచ్చారు అతనంటే గిట్టని మాస్టర్లు. కాని, ఏనాడూ సాయిరాం దొరకలేదు. అయినా ప్రతిరోజు ఏదో ఒక నెపంపై అతన్ని గాయపరిచేవారు మాస్టర్లు. అయితే మిగతా మాస్టర్లు సాయిరాం పట్ల కనబరచే ప్రేమ ముందు

ఇవి సాయిరాంకి ఒక లెక్కలోకి కూడ రాలేదు.

ఒకరోజు భోజనం చేస్తుండగా సాయిరాం సన్నిహిత స్నేహితుడు రాఘవేంద్ర, "సాయిరాం నిన్నో ప్రశ్న అడుగుతాను. సమాధానం చెబుతావా?" అని అడిగాడు.

"ఓ! తప్పకుండా! నాకు తెలిసింది చెప్పటానికే గదా నోరుంది" అన్నాడు సాయిరాం.

"రేయ్! రోజు మాస్టర్లు అంతంత హోంవర్కు ఇచ్చి నిన్ను బాధపెడ్తుంటే నువ్వు వారిపై హెడ్మాస్టరుగ్గాని, మీ అమ్మకుగాని, డీ.ఈ.ఓ. గ్గాని ఫిర్యాదు ఇవ్వలేదు సరికదా, అంత ఓపిగ్గా ఇచ్చిన హోంవర్కు పూర్తిగా ఎట్లా కంప్లీట్ చేసేవాడివిరా? నావల్లకాక మాస్టారు తంతే తన్నులు తిందామని నేను చేయటం మానేశా? తెలుసా?" అన్నాడు రాఘవేంద్ర.

"చూడు రాఘవేంద్ర! మీకు నాకు జీవిత సరళిలో ఎంతో తేడా ఉంది. మీరు మీ శక్తిని అనవసర విషయాలకు, చర్చలకు వృథా చేస్తారు. ఇక ఆటపాటల మాట సరేసరి. కాని, నాకు చిన్నప్పట్నించీ మా నాన్నగారు మానసిక, శారీరిక శక్తులను కలిపి ఉపయోగించటం, ఎంత తక్కువ శక్తితో ఎంత ఎక్కువ పని చేయవచ్చో నేర్పారు. నేను మీలాగా ఆటపాటల ద్వారా ఆనందాన్ని సంపాదించాలని ప్రయత్నించను. కండరాలను శ్రమకు గురిచేసి ఆనందించటం అనాగరిక లక్షణం. నేను ప్రాణాయామం ద్వారా మనస్సును ఏ విషయంపైకి కావాలంటే ఆ విషయంపైకి క్షణాల్లో మరల్చగల అదుపు సంపాదించాను. ఏకాగ్రత వలన గంటసేపు చదివే విషయాన్ని పది నిమిషాల్లో చదవవచ్చు. వ్యర్థ ఆలోచనలు చేయటం, అక్కర్లేని విషయాలు కాలక్షేపానికి ప్రసంగించటం

తెలివితక్కువతనం. మనిషి ఏ పనిచేసినా అది అత్యంత అవసరమై ఉండి, దానికి స్పష్టమైన ప్రయోజనం ఉండాలి. మనం మాట్లాడే మాటకు విలువుంది. అది సద్వినియోగపడేటట్టయితేనే వాడాలి. లేకపోతే మౌనంగా ఉండటం శ్రేయస్కరం. ఇలా విచక్షణతో, యోగాభ్యాసంతో శక్తిని నిల్వ చేసుకోవటం స్వామి వివేకానంద భారతీయ యువతకు చేసిన ఉద్బోధ. మా అమ్మ నాకు వాటి గురించి రోజూ వివరంగా చెప్తుంది. దాన్ని నాతో చేయిస్తుంది. అందువలన మానసికశక్తి కలవాడు శారీరిక శక్తిని సద్వినియోగం చేసుకోగలడు. కేవలం శారీరిక శక్తి ఉన్నా, మనస్సుపై అదుపులేకపోతే వాడు కుక్కకన్నా బలహీనుడు. అందువలనే నాకు ఎంత హోంవర్కు ఇచ్చినా శ్రమనిపించదు" చెప్పాడు సాయిరాం.

సాయిరాం చెప్పిన వివరణను ప్రక్కరూంలో కూర్చుని భోంచేస్తున్న సుబ్బారావు, జనార్ధన్ మాస్టర్లు విని ఆశ్చర్యపోయారు. వాళ్ళు సాయిరాం మాటలు వింటున్నట్లు సాయిరాంకు తెలియదు. కాని, ఈవిధంగా సాయిరాం సమాధానం వాళ్ళను ఎంతో పశ్చాత్తాపానికి లోను చేసింది. ఆ తర్వాత ఎప్పుడూ వాళ్ళు సాయిరాంకు అధిక హోంవర్కు ఇచ్చి అతన్ని బాధపెట్టాలని ప్రయత్నించలేదు. వాళ్ళలో ఇంత హఠాన్మార్పు రావటానికి కారణం సాయిరాంకు కూడ అర్థం కాలేదు. అంతేగాదు, తనచేత మాస్టర్లు భోజన విరామ సమయంలో కావాలనే అడిగించారని సాయిరాంకు చెప్పేందుకు రాఘవేంద్రకు కూడ ధైర్యం చాల లేదు. అన్నింటికీ మించీ దేన్నీ పట్టించుకోకుండా ఏకాగ్రతతో, నియమబద్ధంగా జీవితం నడుపుకొనే సాయిరాంపట్ల అతనికి ఇప్పుడు మరింత ఆరాధన భావం పెరిగింది.



6

సాయిరాం చదువు నిరాఘాటంగా సాగిపోతోంది. సంవత్సరం దొర్లిపోయింది. ఆ సంవత్సరం కామన్ పరీక్షలు. గతంలోలాగా ఇప్పుడు సాయిరాంకు శత్రువైన టీచర్ల సంఖ్య బాగా తగ్గిపోయింది. లోలోన చాలామంది సాయిరాం అంటే చాలా అభిమానం చూపిస్తున్నారు.

పొద్దున్నే అతన్నోసారి పలకరించాలని, అతని తీయని నిష్కల్మష మాటలు వినాలని తహతహలాడే మాస్టర్ల సంఖ్య క్రమంగా పెరిగింది.

గురుమూర్తి మాస్టారు అయితే పొద్దున్నే ఏదో పనున్నట్టు సాయిరాం క్లాసువైపు వస్తారు. ఆ సమయానికి ఆ క్లాసులో హెడ్ మాస్టారు ఉన్నా సరే. ఆయన వెనుకాడరు. ఒక్కసారి సాయిరాం వంక చూసి చిరునవ్వు నవ్వినా సరే, కళ్ళతోటే అమృతం వర్షించి, ప్రేమగా పల్కరించి మరీ

వెళ్లారు. సాయిరాం ఉన్న క్లాసువైపు మాస్టర్లు పొద్దున్న వెళ్తున్నారంటే సాయిరాంను పల్కరించడానికేనని దాదాపు మాస్టర్లందరికీ తెలిసిన బహిరంగ రహస్యం.

ఒకరోజు కోటీశ్వరరావు మాస్టారు తన కొడుకు ఐదేళ్ళ రామకృష్ణను వెంట బెట్టుకొని సాయిరాం క్లాసుకు వచ్చారు.

'ఒక్కసారి సాయిరాంను బయటికి పంపుతారా మాస్టారు' అని అడిగారు క్లాసు టీచర్ శ్రీదేవిగారిని.

ఆవిడ సంతోషంగా సాయిరాంవైపు తిరిగి "ఏమోయ్ సాయిరాం! నీకోసం నానాటికీ పిల్లల బదులు, మాస్టర్లు రావటం ఎక్కువైపోయిందోయ్. వెళ్ళు కోటీశ్వరరావు మాస్టారు వచ్చారు నీకోసం" అని అంది.

"చూడు సాయిరాం నువ్వు అంటే నాకు ఎందుకు కలిగిందోగాని విపరీతమైన అభిమానం కలిగింది. అందుకే ఇవాళ మా అబ్బాయి పుట్టినరోజు, అక్షరాభ్యాసం రెండూ కలిసివచ్చిన సందర్భంలో తొలి చాక్లెట్లు, స్వీట్స్ ప్యాకెట్ నీకు మొట్ట మొదట ఇప్పించాలనుకొన్నాను. తీసికో" అని ప్యాకెట్ బ్యాగ్‌లోంచి తీసి తన కొడుకు రామకృష్ణతో సాయిరాం చేతికి ఇప్పించారు.

సాయిరాం స్వీట్స్ ప్యాకెట్ అందుకొని, రామకృష్ణను ఎత్తుకున్నాడు.

"రామకృష్ణకు హేపీబర్త్‌డే, గుడ్‌లక్ ఇన్ స్టడీస్" అని అతని బుగ్గలు మృదువుగా నిమిరి, కిందికి దించాడు.

కోటీశ్వరరావుగారికి సాయిరాం ప్రవర్తన ఎంతో సంతృప్తిని కలిగించింది. సాయిరాం మాట్లాడే ప్రతి మాట ఆయనకు ఎంతో ఆకర్షణీయంగా కన్పించింది.

"వెళ్ళొస్తా మాస్టారు" అంటూ సాయిరాం కోటీశ్వరరావుగారికి నమస్కారం చేసి క్లాసులోకి వెళ్ళి, టీచర్ శ్రీదేవిగారికి స్వీట్ ప్యాకెట్ ఇచ్చి "ఇందులో స్వీట్లన్నీ పిల్లలందరికీ పంచి పెట్టించండి మేడమ్. కోటీశ్వరరావుగారి అబ్బాయి రామకృష్ణ బర్త్‌డే అని నాకు ఈ ప్యాకెట్ గిఫ్టుగా ఇచ్చారు" అన్నాడు సాయిరాం.

"మోడస్ట్ బాయ్" అంది శ్రీదేవి టీచరు సాయిరాంవంక ఆప్యాయంగా చూస్తూ.

సాయిరాం వెళ్ళి సీట్లో కూర్చున్నాడు. అతని ముఖంలో గర్వంగాని, అహంకాని ఎక్కడా కన్పించలేదు. సాధారణంగా మాస్టర్లు అభిమానించే పిల్లలు తలపొగరుగా, కొంత గర్వంగా ఉండటం అందరూ తరచూ గుర్తించే విషయం.

అందుకే శ్రీదేవి టీచర్ పరీక్షగా అతనివైపు చూసింది. అతని కళ్ళు నిర్మలంగా, అమాయకంగా ఏమీ ఎరగనట్లు ఎప్పుడూ ఉన్నట్లే ఉన్నాయి.

"ఐస్ ఆర్ ది ఇండికేటర్స్ ఆఫ్ హ్యూమన్ ఫీలింగ్స్" అన్నారు రమణ మహర్షి. తొలిసారిగా అంత తీక్షణంగా అతని కళ్ళను శోధించింది మేడమ్ శ్రీదేవి.

"నిజంగానే సాయిరాం వండర్ బాయ్. ఎప్పుడోసారి తారసిల్లే ఇటువంటి అద్భుత పిల్లలే ఈ ప్రపంచానికి తరచూ నాయకులు అవుతారు. బుద్ధుడు, వివేకానందుడు, ఆదిశంకరుడు..." ఏవేవో పేర్లు ఆమె నోటినుంచి యాదృచ్ఛికంగా వెలువడ్డాయి. ఒక్కసారి ఉలికిపడింది శ్రీదేవి టీచరు. అంటే మన సాయిరాం... ఇక ఆలోచించలేకపోయింది.

స్వీట్లు పంచటం అయిపోయింది. అందరూ తినేసి కూర్చోవటం

కూడ అయిపోయింది. శ్రీదేవి టీచర్ మాత్రం గతంలో తాను సాయిరాంను కొట్టినందుకు ఎంతో పశ్చాత్తాపపడింది. అప్రయత్నంగా ఆమె కళ్ళనుంచి రెండు నీటి చుక్కలు చెంపలపైగుండా జాలువారాయి. సాధువులను, పసివారిని, స్త్రీలను కొట్టినవారికి పశ్చాత్తాపం కలిగినప్పుడు ఇలానే కళ్ళనీళ్ళు వస్తాయి.

ఇంతలో క్లాసులోకి సర్క్యులర్ తీసుకొచ్చాడు ఫ్యూన్ వెంకట్రావు.

సర్క్యూలర్ చదివి పిల్లలవైపు తిరిగి చెప్పింది టీచర్ శ్రీదేవి.

"ప్రీ కామన్ పరీక్షలు ప్రారంభం కానున్న సందర్భంగా మీకు పదిహేను రోజులపాటు శలవులు ప్రకటించారు డీ.ఈ.ఓ. ఆ తర్వాత మీకు కామన్ పరీక్షలు జిల్లా స్థాయిలో ఒకేసారి జరుగుతాయి. అయితే మన స్కూలు తరపున కామన్ పరీక్షలకెళ్ళే పిల్లలందరితో మన కోటీశ్వరరావు, కృష్ణమూర్తిగార్ల ఆధ్వర్యంలో పిక్‌నిక్ ఏర్పాటుచేశారు. అందరూ కొత్తపట్నం సముద్రానికి పిక్‌నిక్‌కు వెళ్ళాలి. ఛార్జీలు, వగైరా అన్నీ స్కూలే భరిస్తుంది. మీ మీ టిఫిన్లు మీరు తెచ్చుకోండి సరేనా" అని వారికి చెప్పి సర్క్యులర్‌పై సైన్ చేసి పంపించింది శ్రీదేవి టీచర్.

7

పిక్నిక్‌కు సాయిరాం తనవెంట టేప్ రికార్డర్ తెచ్చాడు. కెమేరా ఫ్లాష్ ఎటాచ్ చేసింది కూడ మెళ్ళో వేసుకు తెచ్చాడు. మిగతా పిల్లలు రకరకాల టిఫిన్లు తెచ్చారు.

దాదాపు స్కూల్లో సగంమంది మాస్టర్లు తమ కుటుంబాలతో వచ్చారు. పిల్లలను సముద్రంలోకి దిగకుండా జాగ్రత్తలు చెప్పారు ముందు హెడ్మాస్టరు, ఇతర మాస్టర్లు.

రకరకాల ఆటలాడారు. ఆ ఆటలన్నీ చూస్తూ కూర్చున్నాడు సాయిరాం.

"నువ్వు ఆడవా సాయిరాం?" అడిగారు దాదాపు ప్రతి మాస్టారు.

"లేదండీ... నాకు అవంటే పెద్ద ఇంట్రెస్టు లేదు. నేను ఇంట్లో దాదాపుగా ఇండోర్ గేమ్స్ ఆడతాను. మా అమ్మగారే నాకు మంచి కంపానియన్" చెప్పాడు సాయిరాం.

'ఓ!... సరే అయితే' అంటూ మిగతా మాస్టర్లు తమ తమ కబుర్లలో మునిగి పోయారు.

సాయిరాం వాళ్ళ ఆటలన్నీ ఫొటోలు తీశాడు. కాసేపు టేప్ రికార్డర్‌లో చక్కటి త్యాగరాజు పాటలు, అన్నమయ్య కీర్తనలు వింటూ కూర్చున్నాడు.

దాదాపుగా రెండు మూడు గంటలు ఆటలయ్యాక పిల్లలు ఆకలి అంటూ మాస్టర్ల దగ్గరికి వచ్చారు.

అందరూ భోజనాలకి కూర్చున్నారు. భోజనాల సమయంలో పిల్లలను తమకు ఇష్టమైన చిన్న చిన్న నాటికలు, పాటలు ఆడి పాడమన్నారు హెడ్ మాస్టారు శర్మగారు.

చాలామంది టీ.వీల్లో అడ్వర్‌టైజ్‌మెంట్లను నటించి చూపారు.

రాఘవ అయితే ఒక రింగుతీసి, తన మెడపైనుంచి కిందికి జారవిడిచి, మధ్యలో ఆపి పొట్టదగ్గర నుంచి కిందకు జారకుండా "మేంగో జూసీ" అంటూ తను నుంచున్న చోటే ముందుకు, వెనక్కు వంగుతూ డ్యాన్సు చేశాడు.

సత్యం అయితే టీవిలో అక్షరజ్యోతి కార్యక్రమంలో వచ్చే పాటను "తూర్పు దిక్కున సూర్యోదయంను హమ్‌చేసి చక్కగా వినిపించాడు.

సత్యంతో పోటీ పడుతూ మరొకడు “విలాన్... విలాన్... విలాన్! నమ్మకమైన, స్ఫూర్తినిచ్చే... బనియన్” అంటూ డ్యాన్స్, పాట రెండూ కలిపి చేసి చూపించాడు.

అంతలో మరొకడు “కోల్‌గేట్ జెల్” అడ్వర్‌టైజ్‌మెంట్; ఇంకోడు సంతూర్ అడ్వర్‌టైజ్‌మెంటు రాగయుక్తంగా పాడి చూపించారు.

చూస్తున్న మాస్టర్లకు కళ్ళు చెదిరిపోయేంత ఖచ్చితంగా ఉన్నాయి వాళ్ళ ప్రదర్శనలు. టీవీ అడ్వర్‌టైజ్‌మెంట్లు పిల్లలపై చూపిస్తున్న ప్రభావానికి ఆశ్చర్యపోయారు హెడ్మాస్టారు శర్మగారు.

ఆ సమయంలో కేశవరావు, “మాస్టారు... ఇదిగో మన అందరి బొమ్మలు. రామ్‌దాసు ఇప్పటికిప్పుడే స్కెచ్ పెన్సిల్‌తో గీశాడు. ఎంత బాగుందో చూడండి” అంటూ కోటీశ్వరరావుగారికి తీసుకెళ్ళి చూపించాడు.

ఆ స్కెచ్ చూసి హెడ్మాస్టరు శర్మగారు రాందాసును అభినందించకుండా ఉండలేక పోయారు.

తూర్పున ఉదయిస్తున్న సూర్యుడు, ఆ పసిడి కిరణాలకు ప్రతిస్పందించే సముద్ర కెరటాలు, దానికి కొంచెం దూరాన వలయాకారంలో కూర్చున్న మాస్టర్లు, పిల్లలు, వాళ్ళలో ఒక్కొక్కరి ముఖం స్కెచ్ పెన్సిల్‌తో ఎంతో స్పష్టంగా గీశాడు రాందాసు.

ఆ చిత్రం చూసి అభినందించిన వారిలో సాయిరాం కూడ ఉన్నాడు.

అంతా అయిపోయింది. భోజనాలు ముగిశాయి.

అందరూ సాయిరాంవైపు తిరిగి "సాయిరాం... నువ్వు ఒక పాట పాడటమో, డాన్సు చేయటమో చేయరాదా?" అని అడిగారు.

"భలేవారే మాస్టారు.. నాకు అవి వస్తే నేను చేయనా? నేను నేర్చుకోలేదు. నేర్చుకోను కూడ" అన్నాడు సాయిరాం దృఢంగా.

"ఏం..." అడిగారు పిల్లలు ఆసక్తిగా.

"చూడండి... నేను చెప్పేది నా వ్యక్తిగత అభిప్రాయం. అయినా దానికి శాస్త్ర ప్రమాణం ఉంది. మిమ్మల్ని నొప్పించడం నా ఉద్దేశ్యం కాదు గాని, నిజానికి చదువుకొనే పిల్లలు సిన్మా పాటలు, అడ్వర్‌టైజ్‌మెంట్లు, డ్యాన్సులు వేయటం వంటివి నేర్చుకొంటే, చదువు దెబ్బతింటుంది. ఉదాహరణకు మీలో చాలామందికి మీరు ఒప్పచెప్పిన పాటలు, టీవీ అడ్వర్‌టైజ్‌మెంట్లు మీరు చదువుకొనేటప్పుడు మీ నోటికి అడ్డం రావటం గమనించే ఉంటారు. దూరాన ఎక్కడ ఆ పాటలు వినబడ్డా సరే మీ ఏకాగ్రత వెంటనే దెబ్బతింటుంది. మీరు చదువుతున్నది మాయమై వాటి స్థానే మీరు ఒప్ప చెప్పిన పాట మీ నోట్లో ఆడటం మొదలుపెడ్తుంది. పైగా ఈ అడ్వర్‌టైజ్‌మెంట్లు, పాటలు, ఆటలు వినోదించాల్సినవే కాని ఒప్పజెప్పేంత విలువైనవి కావు. వాటిని ఉచ్ఛరించటం, వినటం వలన మీ జ్ఞాపకశక్తి, మేధాశక్తి దెబ్బతింటాయి. మనిషి శక్తి అనేకదారుల్లో విచ్ఛిన్నం అవటం వల్లనే ఏదీ సాధించలేక బయటినుంచి ఆనందాన్ని పొందాలని తహతహలాడ్తాడు. వాస్తవానికి ఏకాగ్రతలోనూ, ఒక విషయాన్ని క్షుణ్ణంగా తెల్సుకోవటానికి మించి బాహ్యంగా లభించే ఆనందం ఏదీ గొప్పకాదు" అన్నాడు సాయిరాం.

సాయిరాం చెప్పిన విషయాలు అనేకం మాస్టర్లకు కూడ స్వీయానుభవమే. వాళ్ళు బి.ఏ., బి.ఇడిలు చదివే రోజుల్లో రేడియో

పాటలు వింటూ వాటిని ఒప్పజెప్పిన నేరానికి, రేడియో కట్టేసి పరీక్షలకు చదువుతున్నా, ఎక్కడైనా దూరాన పాటలు వినపడ్డా వాళ్ళ చెవులు నేరుగా అటు పరుగెత్తేవి. అయితే, సిన్మా పాఠాలు ఒప్పజెప్పని మిత్రులు, పరీక్షలప్పుడు రేడియో వింటూ కూడ ఏకాగ్రతతో చదువుకోగలిగేవారు. తమ సంగీత వ్యామోహం, సిన్మాపాఠల పిచ్చి తమకే శత్రువుగా ఎలా పరిణమించిందో తెలిసి చాలా బాధపడేవారు మాస్టర్లు ఆ రోజుల్లో. అయితే ఆ తప్పు తర్వాత తమ పిల్లలు చేస్తున్నా చెప్పలేని నిస్సహాయులైనారు. కారణం లోతైన ఆలోచన వారిలో లోపించటమే.

తర్వాత కాలంలో ఈ విషయాన్నే మర్చిపోయారు. సాయిరాం చెప్పింది పిల్లలకు కూడ స్వానుభవమే. కాని, వారు తమ అలవాటు ఊబిలోంచి బయటికి రావాలంటే మాస్టర్లు, తల్లిదండ్రులు గట్టిగా కృషి చేయాలి. కాని, నేటి పరిస్థితుల్లో అది సాధ్యం కాదని సాయిరాంకూ కూడ తెలుసు.

అయితే మాస్టర్లు సాయిరాంను అతనికి తెలిసిన యోగాసనాలను వేసైనా ఇతర పిల్లలకు ఆదర్శంకోసం చూపించమని అడిగారు.

“అదికాదు మాస్టారు. ఏ విద్యయినా ప్రదర్శనకు యోగ్యం కాదు. విద్యలను ప్రదర్శించటం కీర్తి ప్రతిష్టల వ్యామోహానికి, వ్యక్తి పతనానికి హేతువు. పైగా మా అమ్మగారు, నాన్నగారు నన్ను ఎక్కడా యోగవిద్యలు ప్రదర్శించవద్దని ఆదేశించారు. వాళ్ళ అనుమతి లేకుండా నేను చేయకూడదు. అయితే మీరు ఇంతగా అడుగుతున్నారు కాబట్టి ఒక్క చిన్న ప్రయోగం చేసి చూపిస్తాను. మీలో ఎవరి వద్దనైనా ఒక ఇంగ్లీషు నవలగాని, తెలుగు పుస్తకంకాని, నేను చదవనిది ఉంటే ఇవ్వండి” అని అడిగాడు.

డేవిడ్‌రాజు మాస్టారు పెర్రిమేసన్, అగాథా క్రిస్టీ నవలలు చదవటం అలవాటు. అందరూ ఆయనవైపు చూశారు.

ఆయన వెంటనే తను చదువుతున్న అగాథా క్రిస్టీ నవలని సాయిరాం చేతికి అందించాడు.

సాయిరాం ఆ పుస్తకంవైపు ఓసారి తేరిపార చూశాడు. సుమారు అయిదు వందల పేజీలుంది.

"మాస్టారు. ఈ పుస్తకాన్ని నేను తొలిసారి చూస్తున్నాను. దీన్ని నేను గతంలో ఎప్పుడూ చదవలేదు కూడ. ఇందులో మీకిష్టమైన నాలుగు పేజీలు సెలెక్ట్ చేసి నాకు ఇవ్వండి" అడిగాడు డేవిడ్‌రాజుగారిని సాయిరాం.

ఆయన పుస్తకం మధ్యకు విప్పి వెంటవెంటనే ఉన్న నాల్గు పేజీలను టిక్కుపెట్టి ఇచ్చాడు.

ఆ పేజీలవైపు రెండు మూడు నిముషాలు చూసి దాన్ని తిరిగి మాస్టారు గారికి ఇచ్చేశాడు సాయిరాం.

"మీలో ఎవరైనాసరే ఆ పేజీలవైపు చూడండి. నేను ఆ పేజీల్లో ఉన్నది లైను తర్వాత లైను పూర్తిగా మీకు ఒప్పజెపుతాను! సరేనా! అది చాలా మీకు సంతోషం కలిగించటానికి?" అడిగాడు సాయిరాం అందరినీ.

సాయిరాం ఈ మాటనేసరికి మాస్టర్ల గుండె ఆగిపోయింది.

"ఏమిటీ... ఇప్పుడే చూసిన ఒక కొత్త ఇంగ్లీషు నవల్లో నాల్గు పేజీలు రెండు, మూడు నిముషాల్లో తిరగేసి, దాన్లో ఉన్న పంక్తులను లైను టు లైను ఒప్పజెపుతావా?" ఆశ్చర్యంగా నోళ్ళు తెరిచారు.

హెడ్మాస్టరు శర్మగారికి, ఇతర మాస్టర్లకు, పిల్లలకు ఆ రోజు జరిగిన అన్ని వేడుకలకన్నా ఈ వింత అత్యధికం అనిపించింది.


వెంటనే హెడ్మాస్టారుగారు, ఇతర మాస్టర్లు ఆ పుస్తకం అందుకొని టిక్కుపెట్టిన పేజీలవైపు చూస్తూ ఒప్పజెప్పమని సాయిరాంకు సైగ చేశారు.

సాయిరాం లైను తర్వాత లైను తప్పుపోకుండా పేజీకి పేజీ చొప్పున గడగడ ఒప్పజెప్ప సాగాడు.

మాస్టర్ల రోమాలు నీలుక్కుపోయాయి. పిల్లల ఆనందానికి మేరలేదు. వాళ్ళు ఎగిరారు. పిల్లిగంతులు వేశారు. కొందరు ఆనందం పట్టలేక నేలపై దొర్లారు.

నాలుగు పేజీలు ఒప్పజెప్పేసరికి, ఆ పుస్తకం దాదాపు మాస్టర్ల అందరి చేతుల్లోకి పోయింది. అందరి ఆనందానికి పట్టపగ్గాలు లేవు. వారి జీవితంలో తొలిసారిగా ఒక విచిత్రాన్ని చూశారు. అది కూడ అతి సాధారణమైన తమ స్కూలు విద్యార్థిలో. పసిపిల్లలుగానే అద్భుతాలు సృష్టించినవారి ననేకమందిని టీవీల్లో, పేపర్లలో చూడటం కద్దూ. కాని, ఇప్పుడు వాళ్ళ స్కూల్లోనే అత్యంత సమీపంలో చూస్తున్నారు. వారికదో విచిత్రానుభూతి.

మూడేళ్ళ బాలుడు మారుతీ వ్యాన్ నడపటం టీవీలో 'సాక్షి' కార్యక్రమంలో చూశారు. తొమ్మిదినెలల పిల్లవాడు నీటిలో ఈతకొట్టిన దృశ్యాన్ని చూశారు – టీవీలో. నాలుగేళ్ళ విశాఖపట్నం పాప నూకల చినసత్యంగారి ముందు, శ్రీరంగం గోపాలరత్నం గారి ముందు బ్రహ్మాండమైన సంగీత ప్రదర్శన ఇవ్వటం చూశారు. కాని, తమ స్కూల్లోనే ఉండే ఒక విద్యార్థి అత్యంత సుగుణశీలి అవటమేగాక, ఋషుల జీవితాల్లో జరిగినట్టు ఇలా అద్భుతశక్తిని కలిగి ఉండటం ఇదే మొదటిసారి. అందరూ సాయిరాంను ఎత్తుకొని అభినందించారు. వాళ్ళ కళ్ళు ఆనందభాష్పాలను వర్షించాయి. అంతటి శక్తి కలిగిన సాయిరాం అతి



సాధారణంగా, నిగర్వంగా, మౌనంగా ఉండటం వారి వారి అహంకారాలను నీరు గార్చేసింది.

సాయిరాం మాత్రం "ఇందులో నా ప్రతిభ ఏమీ లేదు. యోగసాధకులందరికీ ఇది సాధ్యమే. ఇదే వివేకానందుడు 'ఎడ్యుకేషన్' పాఠంలో చెప్పింది. అందుకే నేను మీకు ఇది చేసి చూపించాను. వివేకానందులు గూడ అనేక ఇతర దివ్యశక్తులున్నా, దీన్నొక్కదాన్నే ప్రదర్శించారు పశ్చిమదేశాల్లో" అని చెప్పాడు.

ఆ రోజు మాస్టర్లకు ఎంతో సంతోషంగా ఉంది. అంతా హాయిగా పాటలతో ఉల్లాసంగా గడిపి సాయంత్రానికి ఇంటికి చేరారు.

హెడ్మాస్టారుగారు స్వయంగా సాయిరాంను వాళ్ళింటి దగ్గర దించి వెళ్ళారు.

8

ఒకరోజు రాఘవేంద్ర చాలా దిగాలుగా కనిపించాడు సాయిరాంకు. సాధారణంగా అనవసరమైన సంభాషణలు చేయని సాయిరాం, రాఘవేంద్ర చాలా బెంగగా ఉన్నట్లు గ్రహించి, భోజన సమయంలో అతని దగ్గరకు వెళ్ళి కూర్చుని "ఏమిటి రాఘవేంద్ర! ఈమధ్య దిగులుగా ఉంటున్నావేమిటి?" అని అడిగాడు.

"ఏం లేదు సాయిరాం, పరీక్షలు దగ్గర పడ్తున్నాయి కదా! నాకేమో లెక్కలు, ఇంగ్లీషు కొంత ఇబ్బందిగా ఉంటాయి. మా వాళ్ళకు నన్ను ట్యూషన్లో పెట్టే స్తోమత లేదు. కోటీశ్వరరావు మాస్టారు గారికి మాకు దూరపు చుట్టరికం ఉంది. అందువలన మా నాన్న ఆయన దగ్గరకు నన్ను ట్యూషన్‌కు వెళ్ళమంటాడు. కాని, ఆయన డబ్బున్న వాళ్ళ పిల్లలను చుట్టూ వేసుకొని, వాళ్ళకే అర్థమయ్యేట్టు లెక్కలు, ఇంగ్లీషు చెప్తుంటాడు. వాళ్ళతోనే అన్ని సమాధానాలు రుబ్బిస్తాడు. ఎన్నోసార్లు నేను మిగతావాళ్ళతో ఆయన చెప్పేది విందామని దగ్గరికి వెళ్ళి కూర్చుంటే 'రేయ్! నువ్వు అక్కడికి పోయి కూర్చో ఫో! అవసరమైతే నిన్ను పిలుస్తా' అంటాడు – ఇలా డబ్బుతో చదువు సాగుతోంది సాయిరాం" అని కన్నీళ్ళు పెట్టుకొన్నాడు రాఘవేంద్ర.

రాఘవేంద్ర మాటలు విని సాయిరాంకు నోట మాట రాలేదు. అతను ఇలాంటిదేదో చాలా చిక్కుముడి విషయంతో బాధపడ్తున్నట్లు సాయిరాంకు ఊహ కూడ తట్టలేదు.

నిజానికి సాయిరాం వేరొకరితో మాట్లాడక మౌనంగా ఉండటానికిగల కారణాల్లో ఇదొకటి. వ్యర్థ సంభాషణలు శక్తి వృధా చేయటం అయితే, ఇతరుల కష్టాలను పరిష్కరించలేని సామాన్యులు, వారి కష్టాల గురించి ఆలోచించటం, చర్చించటం కూడ వ్యర్థమనే

సాయిరాం అభిప్రాయం. సానుభూతి అనేది కష్టాల్లో ఉన్నవారిని మరింత దుర్బలులను చేస్తుంది.

సాయిరాం మౌనంగా భోంచేసి లంచ్ బెల్ అవ్వగానే క్లాసుకు వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత రెండు రోజులకే ప్రీ కామన్ పరీక్షలకు శలవులు ప్రకటించారు. మళ్ళీ రాఘవేంద్ర, సాయిరాం ఈమధ్య కాలంలో కలుసుకోను వీలుకాలేదు.

కామన్ పరీక్షల్లో సాయిరాం డిస్ట్రిక్ట్ ఫస్టు వచ్చాడు. అతనిని దాదాపుగా ప్రతి పేపర్లు నూటికి నూరుశాతం రావటం డీ.ఈ.ఓ., జిల్లా కలెక్టర్‌లను కూడ ఆశ్చర్య పరచింది. ఆ సంవత్సరం జిల్లా స్థాయి బహుమతులన్నీ సాయిరాంకే దక్కాయి. తల్లితో సహా వచ్చి సాయిరాం బహుమతులు అందుకొన్నాడు.

9

సాయిరాం ఎనిమిదవ తరగతిలోకి ప్రవేశించాడు. స్కూలు శలవుల తర్వాత తెరిచిన తొలిరోజు. రాఘవేంద్ర సాయిరాంను కలిసి ఆలింగనం చేసుకొన్నాడు.


"ఏమోయ్ రాఘవేంద్ర! ఆనాటి ముచ్చట తర్వాత మళ్ళీ కన్పించలేదు నువ్వు. పరీక్షలు ఎలా రాశావోనని ఎన్నిసార్లో అనుకున్నాను" అన్నాడు సాయిరాం.

"భలేవాడివి సాయిరాం. ఆ తర్వాత నేను నిన్ను కలవాలని ఎంతో ప్రయత్నించాను. వీలైతేనా, రెండు, మూడుసార్లు నీ కోసం మీ ఇంటికి వచ్చాను. మీ ఇల్లు తాళంవేసి ఉంది. ఉసూరుమంటూ వెళ్ళాను" అన్నాడు రాఘవేంద్ర.

"అసలు విషయం ఏమిటి? పరీక్షలైతే బాగా రాశావు కదా! ఎంత శాతం మార్కులొచ్చాయి? ఆ విషయాలు చెప్పు ముందు?" అడిగాడు సాయిరాం.

"ఓ తమాషా చెప్పనా? నీతో ఆనాడు కోటీశ్వరరావు మాస్టారు గురించి అలా చెప్పానా? ఆ తర్వాత రెండు రోజుల్లోనే ఆయనలో చాలా మార్పు వచ్చిందోయ్. నన్ను కూడ ఎంచక్కా వాళ్ళబ్బాయి, బొమ్మిశెట్టి వాళ్ళబ్బాయితో కలిపి లెక్కలు, ఇంగ్లీషు చెప్పాడు. దాంతో పరీక్ష రోజులు ఏం ఇబ్బంది లేకుండా సాగిపోయాయనుకో" అన్నాడు రాఘవేంద్ర.

రాఘవేంద్ర సంతోషాన్ని చూసి సాయిరాం తృప్తిగా నిట్టూర్పు విడిచాడు.



రాఘవేంద్ర వెళ్ళిపోయాక తానే కోటీశ్వరరావు మాస్టారుగారి దగ్గరికి వెళ్ళాడు.

సాయిరాంను చూస్తూనే టీచర్స్ రూంలో చాపపై పడుకొన్న కోటీశ్వరరావు మాస్టారు లేచి కూర్చుని.. "రా! సాయిరాం! రా! ఏమిటి వచ్చావు? ఏదన్నా పనా నాతో," అని అడిగాడు ప్రేమగా.

"లేదు మాస్టారు. రాఘవేంద్ర కలిశాడు. పరీక్షల తర్వాత ఇప్పుడే కలవటం. మీరు నా ప్రార్థన ఆలకించి వాడికి పాఠాలు బాగా చెప్పినందుకు నేనెంతో కృతజ్ఞుడ్ని. మీ మేలు, మంచితనం ఎప్పటికీ గుర్తుంచుకుంటాను'' అంటూ ముకుళిత హస్తాలతో కాళ్ళకు నమస్కరించాడు సాయిరాం.

"అదేమిటి సాయిరాం. నిజానికి చిన్నవాడివైనా నువ్వే నాకు కళ్ళు తెరిపించావు. చదువును ఆశించేవారికి పాఠాలు చెప్పక, ధనంపై ఆశతో, ధనిక పేద భేద దృష్టితో పసిమనస్సులను గాయపరిచి నేను ఈ వృత్తికే ద్రోహం చేశాను. డబ్బు ఇచ్చేవారి నుంచి తీసుకోవటం తప్పులేదుగాని, ఇవ్వలేనివారిని అవమానించి గాయపర్చటం సంస్కారం కాదు. నువ్వు నాతో ఇకపై మాట్లాడనని, మీ ఇంటికి రానని తెగేసి చెప్పటంతో నేను ముందు నా మనసు మార్చుకొన్నాను. కాని క్లాసులో పిల్లలకు నేను సరిగా చెప్పకపోవటం వల్లనో, లేక ట్యూషన్ ధనం మీద ఆశతోనో వారికి ఈ రోజు నే చేసే అన్యాయం ముందు ముందు నా పిల్లలను కాటువేయదని గ్యారంటీ ఏముంది? అందుకే రాఘవేంద్రకు ట్యూషన్ శ్రద్ధగా చెప్పాను. ఇకమీద ఈ వ్యాపారంలో ధనిక, పేద భేదం చూపను. సరేనా" అన్నారు కోటీశ్వరరావు మాస్టారుగారు.

సంతోషంగా తలూపుతూ వెనుతిరిగాడు సాయిరాం. అయితే సాయిరాం వలన కోటీశ్వరరావు మాస్టారులో ఈ మార్పు వచ్చిందని రాఘవేంద్రకు తెలిసే అవకాశం లేదు. ఎందుకంటే, ఆ మేరకు సాయిరాం మాస్టారుగారి నుంచి ముందే హామీ తీసుకొన్నాడు. అతను ఈ విషయం తెలిసి మనస్సు నొచ్చుకుంటే అతనికి జరిగిన మేలేముంటుంది. సాయిరాంలోని వెన్నలాంటి మనస్సు క్రమంగా స్కూల్లోని బండరాళ్ళను కూడ కరిగించ సాగింది.

10

సాయిరాంపట్ల స్కూల్లో మాస్టర్లకు, పిల్లలకు కలుగుతున్న అభిమానం భవానీదేవికి తెలియంది కాదు. అంతకు క్రితం తన స్కూల్లో చదువుతున్నప్పుడు కూడ సాయిరాం పట్ల పిల్లలు, మాస్టర్లు అంతులేని ప్రేమానురాగాలు చూపటం, ఇరుగుపొరుగు సాయిరాంను బాగా ముద్దు చేయటం భవానీదేవికి అలవాటయిన విషయమే.

అయితే ఆవిడ సాయిరాంలా నిర్వ్యామోహితురాలు. అందుకు కారణం ఆవిడ భర్తనుంచి నేర్చుకొన్న జ్ఞానం, ఆ తర్వాత స్వయంకృషితో సాధనతో అభివృద్ధి చేసుకున్న తత్త్వచింతన.

ఈ సంఘం నుంచి వచ్చే మానావమానాలకు చర్యనొందటం పిచ్చితనం అని భవానీదేవికి బాగా తెలుసు. ఇవాళ సన్మానించినవారు, రేపు దూషించవచ్చు. ఒకటి అంగీకరిస్తే రెండోదాన్ని కూడ అంగీకరించాలి. అదే దుఃఖ హేతువు కాబట్టి రెంటినీ కలిపి తిరస్కరించటమే మేలు. మనిషికి చేతకానివి ఎన్నో ఉన్నాయి. తమ చేతిలో లేని వాటి గురించి మానసికంగా తర్కించుకోవటం, బాధపడటం

వృధా. అలాగే తన తెలివితేటలను, ప్రతిభను సాయిరాం ప్రజ్ఞను పలువురు కొనియాడినప్పుడు కూడ ఆవిడ ఒకే సమాధానం ఇస్తుంది.

"ఈ అపారమైన సృష్టి పరమాత్మ అనంత జ్ఞానం నుంచి ఉద్భవించింది. అందువలనే ప్రతిచోట మనకు ప్రకృతిలోని ఇంటిలిజెన్స్ నైపుణ్యం కనిపిస్తుంది. ఇవాళ శాస్త్రవేత్తలు శోధిస్తున్న అపారజ్ఞానం అంతా ప్రకృతిలో దానంతటదే నిక్షిప్తమై ఉన్నదే. అటువంటి అనంతజ్ఞానం ముందు ఒక అల్పుడైన మానవుడి మేధస్సు, తను సృష్టించుకోని తన ప్రతిభకు గర్వం, అహం వంటి భావాలను పెంపొందించుకోవటం హేయం. కీర్తి, ప్రతిష్టలు మానవుడి అల్పత్వ పరిణామాలు, సహజం కాదు" ఇదీ భవానీదేవిగారి తాత్త్వికచింతన.

స్థూలంగా చెప్పాలంటే ఆవిడ గంటలసేపు ధ్యానం చేస్తుంది. అదే శిక్షణ కొడుక్కు ఇవ్వగలిగింది కూడ. న్యూటన్, ఐన్‌స్టీన్‌లు, డార్విన్, మార్క్స్‌లు ఎవ్వరూ దేనినీ కీర్తిప్రతిష్టలకోసం, పదవులకోసం, డబ్బుకోసం కనుగొనలేదు. మొన్న ప్రక్కింటి రావమ్మ తన కొడుకు వరదరాజును బండబాదుడు బాది, గాజులు పగులకొట్టుకొని, చేతులు రక్తం వారులు చేసుకొంది.

ఆ దృశ్యం చూసి భవానీదేవి గుండె తరుక్కుపోయింది.

సాయంత్రం రావమ్మ తన గాయాలకు "నీ దగ్గరేమన్నా మందుంటే ఇస్తావమ్మా టీచరమ్మ" అని తనింటికి వస్తే, ఆవిడతో మాట్లాడాలనే అనిపించలేదు భవానీదేవికి.

అయినా మానవసేవకు తాను ఏ కొంచెం ఉపకరించినా శ్రేయమే అని భావించటంతో తనింట్లో ఉన్న టించర్ బెంజాయిన్ తెచ్చి రావమ్మ చేతికయిన గాయాలు తుడిచి, మందురాసి కట్టు కట్టింది.

భవానీదేవి మౌనంగా తన పని చేయగలదుగాని, రావమ్మలాంటి సాధారణ స్త్రీలు కొద్ది కష్టము వస్తే గంటల తరబడి వాగటం, అరవటం, తన బాధ వెళ్ళ బోసుకోవటం సహజమే గదా!

"ఎంత చెప్పినా వినడు తల్లి! మొండి ముండా కొడుకు. ప్రతి ఒక్కటి ఇప్పుడిస్తావా? ఛస్తావా? అంటాడు. నేను మటుకు ఎక్కట్నుంచీ తేను" అంది రావమ్మ.

భవానీదేవి మాట్లాడలేదు, బదులివ్వలేదు. గాజ్ గుడ్డ కత్తిరించి ఆవిడకు కట్లు కడుతోంది.

"అదికాదమ్మా! నాకు తెలియక అడుగుతాను. స్కూలుకు ఫీజులు, ట్యూషన్లకు ఫీజులు. ఇవిగాక ఆ పరీక్షకు నోట్‌బుక్కు, ఈ పరీక్షకు నోటుబుక్కు... కావాలని గోల. తీరా అది చేస్తే, పిక్‌నిక్‌లు, పార్టీలు, విహారయాత్రలు అని డబ్బులడిగే. ఇవన్నీ అయితే సిన్మాలు, షికార్లు, టిఫిన్‌లకు డబ్బులు. ఇలా ఒక్కో పిల్లాడికి ఎంతెంత డబ్బు తేను. ఆయనొక్కడే కదా సంపాదించేది. డబ్బు అందుబాటులో ఉండదు. చెబితే విని చావడాయే" మళ్ళీ చెప్పింది రావమ్మ గునుస్తూ.

భవానీదేవి బదులు పలుకలేదు.

"ఏం తల్లీ! నేను అరుస్తూ, నోరు, గొంతు ఎండగొట్టుకుంటున్నానే తప్ప నువ్వేమీ మాట్లాడవు. నీలాంటి ఆవిడ చెబితేనన్నా వాడికి కాస్త బుద్ధి వస్తుందేమో" అంది రావమ్మ.

"రావమ్మా... నిన్ను నీ బిడ్డని 'ఎందుకు కొట్టావు?' అని అడిగానా?"

"అడగలేదు" అంది రావమ్మ.

"మరి నాకెందుకు చెబుతున్నావు? నీ ఇంటిగోల నీ ఇష్టం. మధ్యలో నాకెందుకు?" అంది భవానీదేవి.

"అదేంటండీ అలా అంటారు. చదువుకున్నదానివి, నాకన్నా పెద్ద దానివి కాబట్టి కాస్త వాడికి నాలుగు మాటలు చెబుతావని నిన్ను అడిగాను. తప్పా" అంది రావమ్మ.

"ఖచ్చితంగా తప్పే. నువ్వు మాత్రం చదువుకొన్నావు. కాని ఏం లాభం? నీ చదువంతా పిల్లల్ని కొట్టడానికి ఎలా ఉపయోగించాలో పరిశోధించి రకరకాలుగా కొట్టడం నేర్చుకొన్నావు. అయినా నాకు తెలియక అడుగుతాను గాని, నేను నీ పిల్లాడికి చెప్పటానికి పనికొస్తే, నీకు చెప్పటానికి ఎందుకు పనికిరాను? నువ్వు ముందు నీ లోపాలు తెలుసుకో. నీ బిడ్డను శిక్షించే ముందు ఆ తప్పు నువ్వు చేయటం లేదా అన్నది ఆలోచించు. వాడ్ని నువ్వు కొట్టేందుకు నీకు హక్కు ఉందను కొంటే, నిన్ను అదే తప్పులు చేసినందుకు ఎవరు కొట్టాలి చెప్పు? ఎందుకు రావమ్మా ఆత్మవంచన. ఇంత వయస్సు వచ్చింది. ఎవరిని కొట్టేందుకు, తిట్టేందుకు మనకు ఏం హక్కుంది? మనకు సేవచేసే అధికారం తప్ప ఎవరిపై ఎటువంటి అధికారం లేదని తెలుసుకోలేని నువ్వు కూడ న్యాయం, ధర్మం మాట్లాడితే ఎలా?

రావమ్మకు భవానీదేవి మాటలు ఆశ్చర్యం కలిగించాయి. కొత్తగాను అనిపించాయి. ఇంతవరకూ ఆమెలాగా తనని నిలవేసిన ఆడవాళ్ళు ఎవ్వరూ లేరు. అందుకని కుతూహలంగా అడిగింది "బాగుందమ్మా! నాలో ఏం లోపాలు చూశావు భవానమ్మా! చెప్పు చెప్పు!"

నిజానికి నీలో బోలెడన్ని వ్యసనాలున్నాయి. ఇరుగుపొరుగుతో వృధాగా గంటల తరబడి వాగుతావు. అది ఎంత శక్తిహీనమో తెలుసా

నీకు? అలానే అవసరాన్నిమించి వస్తువులు, చీరెలు కొంటావు. పొరుగువారితో కలిసి మీవారు లేనప్పుడు సిన్మాలకెళ్తావు. నీ దగ్గర డబ్బులు లేకపోతే అప్పు చేసైనా సర్ది, తర్వాత ఉప్పు, పోపుకు మీ ఆయన ఇచ్చిన డబ్బులో చెల్లవేస్తావు. ఇక వి.సి.పీ.లు ఎవరేసినా, ఎంతదూరం అయినా ఎంచక్కా హాయిగా వెళ్ళి చూసి వస్తావు. అలాంటప్పుడు నిన్ను అదుపు చేసేది ఎవరు? ఏది తప్పో, ఒప్పో నీకే తెలియదే? నీ బిడ్డను కొట్టే హక్కు ఎవరిచ్చారు? మీ ఆయన పచ్చి తాగుబోతు. భయంకరమైన వ్యసనాలు ఆయన్ని పట్టి పీడిస్తున్నాయి. ఇలాంటి ఇళ్ళలో పిల్లలు పుట్టటం మహా పాపం వల్లగాని మరోటి కాదు. తల్లిదండ్రులు తాము నైతిక వర్తనం వీడి పిచ్చి తిరుగుళ్ళు తిరుగుతూ, అడ్డమైన వాగుడు వాగుతూ పిల్లల్ని అదుపు చేయాలను కోవటం పరమ వెర్రితనం, తెలివితక్కువతనం. ఇంకెప్పుడు ఈ ఇంటి ఛాయలకు రాకు. ఫో" అని గట్టిగా మందలించింది.

రావమ్మ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆ తర్వాత రావమ్మ మరెప్పుడు కొడుకును కొట్టలేదు సరిగదా, క్రమంగా తన లోపాలను విచారించి తెలుసుకోవటం ప్రారంభించింది.

ఇలా భవానీదేవి, చుట్టుప్రక్కలవాళ్ళు తనకు తమ గోడు విన్పించినప్పుడల్లా చుర్రున వాత పెట్టినట్టు వాళ్ళ లోపాలను వాళ్ళకే ఎత్తి చూపించేది. మొదట మొదట భవానీదేవిపట్ల వారికున్న వ్యతిరేకత క్రమంగా తొలగి, బాగా చదువుకున్న స్త్రీతో, ఆచరణయుక్తంగా పనిచేసే స్త్రీతో సహచర్యం వలన జీవితంలో సమస్యలు తగ్గుతాయన్న జ్ఞానం వారిలో కలిగింది.

భవానీదేవి మటుకు వారు ఎంత చొరవ తీసుకొని తనతో సహచర్యానికి వచ్చినా తాను కేవలం తనవద్ద ఉన్న పుస్తకాలు ఇచ్చి

చదవమనటం, లేదా రోజు మొత్తం మీద ఎప్పుడో ఒక గంట మాట్లాడటం చేసేది. అంతకుమించి ఇతరులను దగ్గరికి రానీయలేదు. తల్లిదండ్రులు, టీచర్లు పిల్లలపై నేరాలు చెప్పటం, వారిని కొట్టటం అంటే భవానీదేవికి చాలా బాధ కలిగేది. వీళ్ళు తమ తప్పులు సరిదిద్దుకోలేని అసమర్ధులై ఉండి, పిల్లల నేరాలను, ఇతరుల నేరాలను ఎంచేదేమిటి? అని ఆవిడ అభిప్రాయం.

ఒకసారి ఇరుగుపొరుగు రాజ్యం, విజయేశ్వరి, లక్ష్మిగార్లు ఆవిడ్ని అడిగారు "ఏమండి భవానీగారూ! మాకు రోజల్లా చెప్పుకొనేందుకు ఎడతెగని కబుర్లుంటాయి. మీరేమో మౌనంగా అలా రోజల్లా గడిపేస్తారు? ఎలా?" అని.

"మనిషికి జంతువుకి ఉన్న తేడా ఏమిటో మీరు ఎప్పుడూ గుర్తుంచుకోరు. అందుకే మీకు ఇలాంటి సమస్యలు, సందేహాలు. తక్కువ శక్తితో ఎక్కువ ఆనందాన్ని సంపాదించటం, వీలైనంత వరకూ సంతోషాన్ని అవిచ్ఛిన్నంగా పొందాలని ప్రయత్నించటం మనిషి బుద్ధికుశలతకు, ఇంటిలిజెన్స్‌కు ప్రమాణం. నేటి ప్రపంచంలో మీరంతా అనుక్షణం ఆ విధమైన ఆలోచనా వైఖరే కలిగి ఉంటారు. పావలా ఇచ్చి రూపాయి వస్తువులు కొనుక్కోవాలని మీరు ఆశపడరూ! అలాంటప్పుడు గంటల తరబడి మాట్లాడి, మీ శక్తి వృధా చేసుకోవటం వివేకమేనేమో ఆలోచించండి! మీ శరీరంలో శక్తి అంతా మీ వారు సంపాదించే ధనం, దాంతో కొన్న బియ్యం, ఉప్పు, పప్పు, కూరగాయల్లోది. వాటిని చౌకగా కొని, బాగా తినటం వలన ప్రయోజనం ఏముంది – మీ శక్తి అంతా వృధా చేస్తున్నప్పుడు? అసలు వాగుడువలన ప్రయోజనం ఏముందో చెప్పండి? మీ నల్గురికి తెలిసిన ఒకే విషయం గురించి మాట్లాడుకోవటం

వలన ఎవ్వరికీ ఏ ఉపయోగం లేదు. అది నాలెడ్జీ కాదు; మరొకటీ కాదు, పోనీ మీలో ఒకరికి తెలియంది ఒకరు చెప్తే వినే సంస్కారం, నేర్చుకొనే సంస్కారం ఎంతమందికి ఉంది? ఎవరికివారే మీలో మేధావులుగా భావించుకొంటే మీరు మాట్లాడుకోవటం వృథా. అసలు ఈ ప్రపంచంలో ప్రయోజకులైన వారెవ్వరూ వాగి, శక్తి వృథా చేసుకోరు. వాగకుండా శక్తి నిల్వ చేసుకుంటారు. వారే ఏదైనా సాధించగలరు. ఈ విషయాలు మీరు మీ పిల్లలకు చెప్పరు. అందవలన వాళ్ళు పనికిమాలిన కబుర్లతో జీవితం గడిపేస్తుంటారు" చెప్పింది భవానీదేవి.

భవానీదేవి మాటలు వారిని ఆలోచింప చేశాయి. క్రమంగా సాయిరాం లాగానే వాళ్ళ పిల్లలు కూడ వాగుడు, ఆటలు తగ్గించి శక్తిని వృథా చేసుకోకుండా ఎంతో ఆరోగ్యంగా ఉంటూ చదువుకోగల్గుతున్నారు.

11

ఒకరోజు ఇంటర్వెల్లో సాయిరాం ఒక్కడే క్లాసులో కూర్చుని ఉన్నాడు.

ఇంతలో హఠాత్తుగా దూరంనుంచి ఎవరో పెనుగులాడుకుంటున్న అరుపులు, కేకలు వినిపించాయి. తలెత్తి చూశాడు సాయిరాం.

ఆవైపు నుంచి రాఘవేంద్ర ఆయాసపడ్తూ ఒక్క పరుగుతో సాయిరాం వద్దకు వచ్చాడు.

"ఏమిటి రాఘవా? ఎందుకీ ఆయాసం, పరుగూ, హడావుడిని. ఏమైంది?" అని అడిగాడు సాయిరాం.

"మరే... నువ్వు అసెంబ్లీ రౌడీ సిన్మా చూశావా? ఆ సిన్మా ఫక్కీలో మన కామేశ్వరం, కలెక్టరుగారి పి.ఏ.గారి అబ్బాయి రాజేష్ కలేబద్దానికి

పందాలేసు కుంటున్నారు. వీడి పక్కన రమేష్, రవి, రాజాలు ఉండి రాజేష్‌ను ఎగదోస్తున్నారు. వాడి పక్కన రాంబాబు, యాదవ్‌లు వాడ్ని పురికొల్పుతున్నారు. ఆ సిన్మాలో మోహన్‌బాబు, మరో ముస్లిం విలన్ తబలా వాయిస్తాడే వాళ్ళు కొట్టుకొన్న స్టైల్లో వీళ్ళు ఇప్పుడు కలేబడ్తారట. ఎవరు గెలిస్తే, వాడికి రెండోవాడు టిఫిన్ ఇప్పించి, సిన్మాకి తీసుకెళ్ళాలిట. నువ్వు రా సాయిరాం. నాకు భయమేస్తోంది" అన్నాడు రాఘవేంద్ర.

"భలేవాడివే, భయం దేనికి? బాగా కొట్టుకొని, ఒళ్ళు పొగరు తగ్గితే వాళ్ళే ఊరుకొంటారు" అన్నాడు సాయిరాం.

"అదికాదు సాయిరాం! వాళ్ళిద్దరి చేతుల్లో సైకిల్ చైన్లున్నాయి. పైగా వాటికి బ్లేడ్లు కూడ వేలాడేశారు. ఫక్తు సిన్మా స్టైల్ అనుకో. ఛస్తారురా! ప్రాణాలు పోతాయంటే, వెధవ ప్రాణాలు పోతే ఎంత? ఉంటే ఎంత? అని పిచ్చి పిచ్చిగా ఒకరినొకరు కవ్వించుకొంటున్నారు సాయిరాం. నువ్వు రా. ప్లీజ్" బ్రతిమాలి అడిగాడు రాఘవేంద్ర.

సాయిరాం ఒక్క క్షణం ఆలోచించి "సరే పద" అంటూ లేచి వెళ్ళాడు.

ఇద్దరూ ఆ సంఘటన స్థలానికి చేరే సరికి, ఒకరిపై ఒకరు సిన్మా ఫక్కీలో చైన్లు ఎగరేసుకొంటున్నారు. రాజేష్ కామేశ్వరరావుని ఉడికించి, ఉడికించి 'చెక్ చెక్' అని మ్యూజిక్ నోటితో వేస్తూ వాడిమీదికి చైన్‌ను అదునుచూసి విసురుతున్నాడు. వాడేమో హీరోలాగా నేలపై పల్టీలు కొట్టి టక్కున లేచి రాజేష్‌పైకి చైన్ విసురుతున్నాడు.

ఈ యుద్ధం చూసి మిగతా పిల్లలంతా ఈలలు వేస్తూ, "కమాన్, ఎటాక్" అంటూ అరుస్తూ వాళ్ళను ఇంకా రెచ్చగొడ్తున్నారు.

సాయిరాం గబుక్కున ఒకవైపుకు వెళ్ళి రాజేష్‌ను పక్కకి లాగేశాడు.

రాజేష్ మీదకు చైన్ విసరబోయిన కామేశ్వరరావును రాఘవేంద్ర లాగేశాడు.

వెంటనే పిల్లలంతా తమ ఉద్రిక్త మనస్తత్వం నుంచి తిరిగి భూమి మీదకు వచ్చారు. సాయిరాంను చూడగానే వాళ్ళ వికారాలు కూడ ఉపశమించాయి.

"మీకేమన్నా పిచ్చి పట్టిందా? ఇదేమి సరదా? ఈ భయంకరమైన ఉన్మాదంతో మీరు ఏమి నిరూపించాలనుకొంటున్నారు?" అడిగాడు సాయిరాం.

"వీళ్ళలో ఎవడు మోహన్‌బాబులాగా ఫైటింగ్ చేయగలడో తేల్చుకోవాలను కొంటున్నారు సాయిరాం" అందులోంచి ఒకడు ముందుకు వచ్చి చెప్పాడు.

"మీ ముఖం. అది సిన్మా. సిన్మాలో వాళ్ళు నిజంగా యుద్ధం చేసుకోరు. షూటింగ్ కోసం అలా నటిస్తారు. సిన్మాలోలాగా నిజ జీవితంలో హీరో అనేవాడు ఎవ్వడూ ఉండడు. ప్రతి ఒక్కడు తనదైన బాణిలో, ప్రత్యేకతలో ఒక హీరోనే. అయితే మనిషి తనకూ జంతువుకు మధ్య తేడా చెరిపేసే ఏ పనీ హీరోయిజం కాదని గ్రహిస్తే కాని, అసలు హీరోను తెలుసుకోలేడు. మీకు పిచ్చి పట్టింది. సిన్మాల్లో హీరోల యుద్ధాన్ని కుక్కలు చూడవు. దున్నపోతులు చూడవు. అయినా అవి మీ అంత అనాగరికంగా ప్రవర్తించటం లేదు. బుర్ర ఉన్న మనుషులు తమ తెలివితేటలతో ఎవరికన్నా మంచి చేయగలమా, అది సాధ్యమా అని ఆలోచించాలి. నువ్వు వాడ్ని చైన్ ఫైటింగ్‌లో నాలుగు కొట్టినంత మాత్రాన హీరోవి ఎలా అవుతావు? నిన్ను ఇంకొకడు తంతే రేపు నీవు జీరోవయినట్లే కదా! సాపేక్షమైన బలాల విషయాల్లో ఇలాంటి పోటీలు, పందాలు పిచ్చివాళ్ళు పెట్టుకొంటారు. ఒకరిని కొట్టటం, బాధ పెట్టటం, హింసించి

గెలిచాననుకోవటం ఉత్తి పిచ్చి. అలాంటి అపోహ ఏనాటికీ నిలువదు. ఆనందాన్నివ్వదు. ఒకడు తన్ను తాను హీరో అనుకొంటే వాడిని సవాలు చేసేవాళ్ళు వెయ్యిమంది ఉంటారు. వాళ్ళని గెలవటం సాధ్యం కాదు. మనస్సుకు శాంతి ఉండదు. మిమ్మల్ని మీరు సృష్టించుకోలేదు. మీరు ఎలా పుట్టారో కూడ మీకు తెలియదు. మీ దేహాలపై మీకు ఈ విధమైన అధికారం ఎవరు ఇచ్చారు?" మెత్తగా మందలించాడు సాయిరాం.

"అంటే మనిషి బలాబలాలు తేల్చుకోకూడదంటావా?" అడిగాడు రాజేష్ ఉక్రోషంగా.

"మీ మొహం బలం నువ్వూనూ... మొన్న కడుపు నొప్పితో ఆస్పత్రిలో గిజగిజ లాడుతూ మీ అమ్మతోటి 'అమ్మా, నొప్పి భరించలేనే, చచ్చిపోతానే' అంటూ ఏడ్చిననాడు, మేమంతా నీకు ధైర్యం చెప్పడానికి ఆస్పత్రికి వచ్చిననాడు ఏమైందిరా నీ బలం. ఒక నరం శరీరంలో చిక్కుబడితే నీ ప్రాణం నువ్వు అదుపు చేయలేవుగాని, 'బలంట బలం', సిగ్గులేకపోతే సరి. చేతనైతే ఆ మేకపిల్లను పది నిమిషాలసేపు కాళ్ళు, చేతులు కదలకుండా గట్టిగా పట్టి ఉంచు. నేనే నిన్ను బలాఢ్యుడు అని అందరిచేత ఒప్పిస్తాను" అన్నాడు సాయిరాం.

ఓ! అంటూ రాజేష్ వెళ్ళి దూరాన ఉన్న మేకపిల్లను పట్టుకొచ్చి దాని ముందు రెండు కాళ్ళు, వెనుక రెండు కాళ్ళను గట్టిగా కదలకుండా పట్టుకొన్నాడు.

రెండు నిమిషాలు 'మే' అని అరిచిన మేక ఉన్నట్లుండి దాని కాళ్ళను ఒక్క దులుపు దులిపింది. దాని కాళ్ళు రాజేష్ చేతుల్లోంచి జారిపోయి అతని పెదవిపై గుద్దుకొన్నాయి. టప్పున పెదవి చిట్లి రక్తం వచ్చింది. వెంటనే బాధగా అరిచి దాన్ని వదిలేశాడు రాజేష్.

"అర్థమయిందా కామేశ్వరం. నీ బలం కూడ పరీక్షించుకొంటావా?" అడిగాడు సాయిరాం.

తలొంచుకున్నాడు కామేశ్వరం.

"శారీరిక బలం మనిషికి ఉండవలసిందే. నిత్య జీవితంలో ప్రయాణాల్లో, పబ్బాల్లో, కష్టసుఖాల్లో పనిచేయడానికి ఈ శరీర బలం ఉపయోగపడుతుంది. అంతేకాని, ఎవరినో కొట్టేందుకు కాదు. పదండి! మాస్టారు క్లాసుకు వచ్చి ఉంటారు" అని సాయిరాం క్లాసు దారిపట్టాడు.

జరిగిన విషయం అంతా తెలుసుకొని, సుబ్బారావు మాస్టారు సాయిరాంను ఎంతో అభినందించాడు. ఎందుకంటే, కామేశ్వరరావు సుబ్బారావు మాస్టారుకి మేనల్లుడవుతాడు. ఆ విషయం సాయిరాంకే తెలియదు. తర్వాత తెలిసినా సాయిరాం దాన్ని ఏనాడు పట్టించుకోలేదు.

కాని, సిన్మాల్లో జంతుబలం ప్రశంస నానాటికీ పెరిగిపోవటం మాత్రం పిల్లలను సులువుగా తప్పుడు ఆలోచనా సరళిలోకి తీసుకెళు _ందని సాయిరాం పదేపదే చెప్పటం క్రమంగా మిగతా పిల్లల్ని చాలా వరకూ సిన్మా ప్రభావం నుంచి దూరం చేయసాగింది.

క్రమంగా పిల్లలు ఇదివరలోలా కాకుండా ఇప్పుడు టీవీలు, సిన్మాల జోలికి పోవటం బాగా తగ్గించేశారు. సాయిరాం ఎక్కువసేపు మౌనంగా ఉండటాన్ని గమనించి ఇతర పిల్లలు కూడా మౌనంలో ఉన్న శారీరిక హాయి, మానసిక విశ్రాంతి అర్థం తెలుసుకోసాగారు. 'మౌనం వలన మెదడుకు మేలు' అని ఇప్పుడు ప్రతి క్లాసులో బోర్డు రాసిపెట్టారు విద్యార్థులు. తమకు తామే మౌనం విలువ గుర్తించటం వలన, మునుపటిలాగా స్కూల్లో క్లాసుల్లో మానిటర్‌ల అవసరం, మాస్టర్లకు పిల్లల్ని బండబాదుడు బాదే అవకాశం తప్పింది.

12

ఇప్పుడు ఇదివరలోలా స్కూళ్ళలో డిటెన్షన్ పద్ధతి లేదు. ఒక క్లాసు నుంచి మరో క్లాసుకు పాస్ చేయటానికి అటెండెన్స్ ఉంటే చాలు. అందువలన సాయిరాం, అతని తోటి విద్యార్థులు ఎనిమిది, తొమ్మిది పూర్తిచేసి తిన్నగా పదవ తరగతిలోకి వచ్చారు.

సాయిరాం స్కూల్లో దాదాపు మౌనవ్రతం ఉద్యమాన్నే లేవదీశాడు. ఫలితంగా పిల్లలతోపాటు మాస్టర్లకు కూడా స్కూల్లో మౌనం పాటించవలసిన అగత్యం ఏర్పడింది.

హెడ్మాస్టరు శర్మగారు గతంలోకన్నా ఎక్కువగా ఇప్పుడు రౌండ్స్ వేయటం మొదలుపెట్టారు.

ఎక్కడన్నా రెండు క్లాసుల మధ్య మాస్టర్లు కబుర్లాడుకోవటం కనిపిస్తే ఆయన ఆగ్రహోదగ్రుడయ్యేవాడు.

"చూడండి... స్వయంగా ఆచరించే పిల్లవాడు ఒక్కడు ఈ స్కూలుకు రావటం మనకెంత అదృష్టమో! లేకపోతే మీరు చెప్పే నీతులు మీరు ఆచరించకపోతే మీ మాటలు పిల్లలు ఎలా వినేవారు? క్లాసుల మధ్య నుంచొని మీరు మాట్లాడటం ఆపకపోతే పిల్లలు ఎలా ఆపుతారు మాట్లాడటం? దయచేసి మీరే నైతికంగా ఎదగటం ఆచరించి చూపటం ప్రారంభించండి" చెప్పారు శర్మగారు మాస్టర్లందరికీ టీచర్స్ మీటింగ్‌లో. దాంతో మాస్టర్ల నోటిలో పచ్చివెలగ్గాయ పడ్డట్టయింది. వీరిలో కొందరికి సాయిరాం పదవ తరగతి పూర్తిచేసి స్కూలు వదిలేది ఎప్పుడా అని ఎదురు చూడటం కూడ అవశ్యమైంది.

13

అందరూ ఆశించినట్లే సాయిరాం స్కూల్‌కి, స్టేట్‌కి ఫస్ట్ ర్యాంకు వచ్చాడు.

హెడ్మాస్టారు శర్మగారి ఆనందానికి పట్టపగ్గాలు లేవు.

"సాయిరాం... అంటూ పరుగున వెళ్ళి అతన్ని కౌగలించుకొని నెత్తిపై ముద్దుల వర్షం కురిపించాడు. బాబు! నేను హెడ్మాస్టారుగా ఈ సంవత్సరం రిటైర్ అవబోతున్న తరుణంలో ఈ స్కూల్‌కి ఎంత గొప్ప కీర్తి తెచ్చావయ్యా! నువ్వు ఈ స్కూలుకి రావటం నా పూర్వజన్మ సుకృతం. లేకపోతే ఏ హెడ్మాస్టారుకు ఈ అదృష్టం వరించి ఉండేదో. ఈ రోజు ఈ స్కూలు పేరు, నా పేరు రాష్ట్రం మొత్తం అన్ని దినపత్రికల్లో మారు మ్రోగిపోతోంది చూడు. ప్రాంతీయ వార్తలు, టీ.వీ. వార్తలు అన్నింట్లో నీ పేరు, ఫొటోలు – అబ్బ ఎంత అదృష్టవంతుడ్నయ్యా, ఇవాళ నీ వల్ల ఈ స్కూలుకు, స్కూలు మాస్టర్లకి ఎంతో కీర్తి వచ్చింది. రేపు రైల్లో వెళ్తున్నా, బస్సులో వెళ్తున్నా 'ఎక్కడ పనిచేస్తున్నారు మాస్టారు?' అని ఎవరడిగినా, 'ఒంగోల్లో ఫలానా మున్సిపల్ స్కూల్' అని గట్టిగా బల్లగుద్ది చెప్పుకోగలమయ్యా. ఆ సమాధానం వినగానే ఎవరైనా సరే 'ఓ మొన్న స్టేట్ ఫస్ట్ ర్యాంకు వచ్చింది మీ స్కూల్‌కే గదా!' అని తీరాల్సిందే" అంటూ హెడ్మాస్టారు శర్మగారు సాయిరాంను ముద్దు చేశారు. సాయిరాంపట్ల తొలుత మనోవికారాలు పొందిన టీచర్లు సైతం తమ స్కూలుకు వచ్చిన ఘనకీర్తికి ఎంతో సంతోషించారు.

అతనికి టీ.సీ., సర్టిఫికెట్లు అందిస్తున్నప్పుడు హెడ్మాస్టరుగారిని, కోటీశ్వరరావు గారిని, గురుమూర్తి గారిని, శ్రీదేవి టీచర్‌ను అదుపు చేయటం కష్టమైపోయింది. వాళ్ళు ఫొటోగ్రాఫర్‌ను పిలిచి సాయిరాంతో

నిల్చుని, కూర్చుని, ముద్దుచేస్తూ ఎన్నో ఫొటోలు తీసుకున్నారు. ఎంతోమంది సహ విద్యార్థులు కళ్ళ నీళ్ళ పర్యంతం కాగా, టీ.సీ. అందుకొని స్కూలు మెట్లు దిగాడు సాయిరాం తల్లి భవానీతో. సాయిరాంలాంటి నైతికమూర్తిని, ఉత్తమ విద్యార్థిని మళ్ళీ ఆ స్కూలు ఎప్పుడు పొందుతుందోగానీ, అక్కడి మాస్టర్లకు సాయిరాం ఎప్పుడూ మధుర భావనే – సాయిరాం క్రమంగా రోడ్డుపైకి వెళ్ళి కనుమరుగవు తుంటే, అనేకమంది మాస్టర్ల కళ్ళు కన్నీళ్ళతో మసక మసకయి పోయినాయి. ధారగా కంటివెంబడి కారే కన్నీరుతో బోసిపోయిన పదవ తరగతి హాలు చూసి హెడ్మాస్టారు శర్మగారు అక్కడే కూలబడ్డారు. ఆయనకు మిగతా మాస్టర్లు కొంత ధైర్యం చెప్పటానికి ఉపక్రమించారు.

– సమాప్తం –